# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

సోమవారం, మార్చి 16, 2026 | సంపుటి - 20 | సంచిక 185 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## నేను డ్రగ్స్ టెస్ట్‌కు రెడీ

### ఇప్పటికే చాలాసార్లు చెప్పా.. కేటీఆర్ సీరియస్

హైదరాబాద్ : డ్రగ్స్ మనుషులను రాక్షసులుగా మారుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న వ్యక్తులే మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలకు తాను పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగాన్ని బీఆర్ఎస్ కూడా తీవ్రంగా ఖండిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2లో



## మోగిన అసెంబ్లీ

# ఎన్నికల నగారా

### నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికలు



**మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఎన్నికలు**

- అస్సాం, కేరళ, పుదుచ్చేరిల్లో ఏప్రిల్ 9న పోలింగ్
- తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్
- పశ్చిమబెంగాల్ రెండు విడుతల్లో పోలింగ్
- తొలి విడుత పోలింగ్ ఏప్రిల్ 23న, రెండో విడుత పోలింగ్ ఏప్రిల్ 29న
- తక్షణమే అమల్లోకి కోడ్.. మే 4న ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈసీ వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం.. అస్సాం, కేరళ, పుదుచ్చేరిల్లో ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుంది. తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇక పశ్చిమబెంగాల్ రెండు విడుతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. తొలి విడుత పోలింగ్ ఏప్రిల్ 23న, రెండో విడుత పోలింగ్ ఏప్రిల్ 29న జరుగనుంది. మే 4న నాలుగు రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. నాలుగు రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరిలో శాసనసభల పదవీకాలం మే, జూన్ల నెలల్లో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. 2లో

### కేసీఆర్‌ది అభివృద్ధి అయితే

## రేవంత్‌ది విధ్వంసం

### రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు ఫైర్



హైదరాబాద్ : కేసీఆర్‌ది అభివృద్ధి అయితే రేవంత్ రెడ్డిది విధ్వంసమని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. బుల్డోజర్లతో ఇండ్లను కూల్చడమే పనిగా పెట్టుకున్నాడని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక ప్రజలందరూ ఇబ్బందుల్లోనే ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ ముషీరాబాద్ బోలక్‌పూర్‌లోని అంజుమన్ గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. 2లో



### ఆధారాలు బయటపెడితే

## నన్ను బదనాం చేస్తారా

- మూసీపై ప్రజెంటేషన్‌కు ఎందుకు పిలవలేదు
- హైడ్రాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి అరాచకం
- రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కవిత ధ్వజం

హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంక్‌కు మూసీ పరివాహక ప్రాంత భూములను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

తరువాయి 2లో

### నెతన్యాహు బతికి ఉంటే

## వెంటాడి చంపుతాం



### ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్ హెచ్చరిక

టెహ్రాన్ : ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బయటి ప్రపంచానికి కొద్ది రోజులుగా కనిపించకపోవడంతో ఆయన ఉనికిపై రకరకాల ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఇరానియన్ రెవల్యూషనరీ గార్డ్ ఘాటు హెచ్చరిక చేసింది.

తరువాయి 2లో



### పార్లమెంట్ మెట్లపై

## టీ, పకోడీ

### రాహుల్ గాంధీకి ఆ మాత్రం తెలియదా

### అమిత్ షా ఆగ్రహం

న్యూఢిల్లీ : ప్రధాని మోదీని, బీజేపీని వ్యతిరేకించే క్రమంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశాన్ని అపఖ్యాతి పాలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. ఇటీవల రాహుల్ గాంధీ పార్లమెంట్ మెట్లపై నిలబడి 2లో




## ఈ నెల 22న రైతు భరోసా మొదటి విడత నిధులు..!

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల ముందు అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రైతులను కష్టాల పాలు చేస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ సర్కార్‌పై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో దిగొచ్చిన రాష్ట్రప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధుల విడుదలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులతో చర్చించినట్టు సమాచారం. తొలి విడతగా మొత్తం 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి ఒక ఎకరం వరకు రైతు భరోసా కింద రూ.3,590 కోట్లు బదిలీ చేయనున్నారు.

తరువాయి 2లో

### డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఎంపీపై

## అనర్హత వేటు వేయాలి

### వైఎస్ షర్మిల డిమాండ్



ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. ఒక ఎంపీ అయ్యి ఉండి డ్రగ్స్ పార్టీలో పట్టుబడటం సిగ్గుచేటని విమర్శించారు. ఆ ఎంపీపై తక్షణమే అనర్హత వేటు వేయాలని, తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుంటే, ఇక్కడ ఎంపీ కొకైన్‌తో విందు, చిందులు దారుణమన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తారా..? అని ప్రశ్నించారు. తన పార్టీ ఎంపీకి డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చింది కదా.. ఇప్పుడు చంద్రబాబు ఏం చర్యలు తీసుకుంటారని నిలదీశారు. డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన ఎంపీ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని, యువతను డ్రగ్స్ వాడమని ప్రోత్సహిస్తున్నారా..? అని షర్మిల మండిపడ్డారు. ఓట్లు వేసి గెలిపించిన ఏలూరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తన ఎంపీపై చర్యలు తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని షర్మిల సవాల్ చేశారు.



### ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై

## డ్రగ్స్ కేసు

### సీఎం చంద్రబాబు ఆగ్రహం..

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్‌పై ఆరోపణలను చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎంపీ మహేష్‌ను పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఆరోపణలకు సంబంధించి వివరణ కోరుతూ పుట్టా మహేశ్‌కు నోటీసులు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను చంద్రబాబు ఆదేశించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ డ్రగ్స్ కేసులో పట్టుబడిన అంశంపై నివేదిక ఇవ్వాలని పల్లా శ్రీనివాస్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వ్యక్తులు, నేతలు చేసే తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. కాగా, డ్రగ్స్ కేసులో అరెస్టైన పుట్టా మహేశ్‌కు స్టేషన్ బెయిల్ లభించడంతో విడుదలయ్యారు.

# నేను డ్రగ్స్ టెస్ట్‌కు రెడీ

ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, అక్రమంగా విక్రయించినా, వారికి ఎలాంటి రాజకీయ పలుకుబడి ఉన్నప్పటికీ వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని సూచించారు. అయితే డ్రగ్స్‌కేసును రాజకీయంగా ఉపయోగిస్తూ బీఆర్ఎస్ పార్టీని లాగడం అత్యంత దారుణమైన రాజకీయాలు అని కేటీఆర్ మండిపడ్డారు. ఈ కేసును బీఆర్ఎస్‌పై కక్ష సాధింపు చర్యలకు వాడుతున్నారని విమర్శించారు. నేను ఎప్పుడైనా డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ పునరుద్ఘాటించారు. డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధమని ఇప్పటికే చాలాసార్లు చెప్పానని గుర్తుచేశారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ చేసిన ప్రతిపాదనను స్వాగిస్తున్నానని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ముందుండి ఆదర్శంగా నిలబడాలన్నారు. ఇక, ప్రతి డ్రగ్స్ కేసులో తన పేరును వాడటంపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ఇకపై తన పేరును డ్రగ్స్ కేసులో అనవసరంగా లాగితే చట్టపరమైన నోటీసులు ఇస్తామని హెచ్చరించారు.

# కేసీఆర్‌ది అభివృద్ధి అయితే రేవంత్‌ది విధ్వంసం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ సలీంతో కలిసి ముస్లిం మహిళలకు రేషన్ కిట్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మైనారిటీ నాయకులు సలీం ఇప్పటివరకు 10వేల తోఫా కిట్లను పంపిణీ చేశారని తెలిపారు. కేసీఆర్ నిరుపేదల గురించి ఆలోచించి షాదీ ముబారక్ పథకంతో లక్ష రూపాయలను అందజేసేవారని గుర్తుచేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక షాదీ ముబారక్ అమలు కావడం లేదని పేర్కొన్నారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో ఒక్క మంచి పనైనా చేశారా అని ప్రశ్నించారు. ఇమామ్ మోజమ్‌లకు వేతనం పెంచుతామన్నారని.. తులం బంగారం ఇస్తామని అన్నారని.. ఏ ఒక్కటీ ఇవ్వలేదని చెప్పారు. రెండున్నర సంవత్సరాల్లో ఒక్క ఇల్లు కట్టలేదు కానీ లక్ష ఇళ్లు కూల్చారని తెలిపారు. రేవంత్ రెడ్డి జూనియర్ యోగి అయిపోయాడని హరీశ్‌రావు విమర్శించారు. బుల్డోజర్లతో ఇండ్లను కూల్చడమే పనిగా పెట్టుకున్నాడని తెలిపారు. కేసీఆర్‌ది అభివృద్ధి అయితే రేవంత్ రెడ్డిది విధ్వంసమని అన్నారు. కేసీఆర్ వచ్చాక మంచినీటి ఇబ్బందులు పోయాయని.. కానీ మళ్లీ మంచినీటి ఇబ్బందులు పోయాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్ ఎందుకు మాయమైందని ప్రశ్నించారు. కరోనా సమయంలో కూడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకున్న నాయకుడు కేసీఆర్ అని హరీశ్‌రావు తెలిపారు. మీ అందరి దయ వల్ల అల్లా దయవల్ల మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. మళ్లీ మంచి రోజులు రావాలని అన్నారు. రంజాన్ నెల పవిత్ర మాసమని.. ఏదైనా కోరుకుంటే జరుగుతుందని వ్యాఖ్యానించారు. నేడు ప్రపంచమంతా యుద్ధ వాతావరణం ఉందని తెలిపారు. సిలిండర్ దొరకడం లేదు.. నిత్యవసర ధరలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. ప్రజలందరి ఇబ్బందులు తొలగిపోవాలని ప్రార్థించాలని సూచించారు. మళ్లీ అందరికీ మంచి రోజులు రావాలని కోరుకుందామని పేర్కొన్నారు.

# నెతన్యాహు బతికి ఉంటే వెంటాడి చంపుతాం

నెతన్యాహు బతికి ఉన్నట్టయితే ఆయనను వెంటాడి మరీ అంతమొందిస్తామని హెచ్చరించింది. చిన్నారులను పొట్టనపెట్టుకున్న హంతకుడిగా నెతన్యాహును అభివర్ణించింది. ఆయన ఇప్పటికీ బతికే ఉన్నారా అనేది మాత్రం అనుమానమేనని ఇరాన్ అభిప్రాయపడింది. నెతన్యాహు మరణించి ఉంటాడని?.. లేకపోతే కుటుంబంతో పాటు దేశాన్ని వీడి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ఇటీవల నెతన్యాహు పత్రికా సమావేశానికి సంబంధించిన వీడియో విడుదల కావడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. వీడియోలో నెతన్యాహు చేతికి ఏకంగా ఆరు వేళ్లు ఉండటం గమనించిన కొందరు అది ఏఐతో చేసిన వీడియో అని కామెంట్ చేశారు. ఈ క్రమంలో అమెరికా రాజకీయాల విశ్లేషకురాలు కాండిస్ ఓవెన్స్ కూడా నెతన్యాహు ఎక్కడ? అని ప్రశ్నించడం మరింత కలకలం రేపింది.

# ధర్మదాం నుంచి సీఎం విజయన్ పోటీ..

## కేరళంలో 86 స్థానాల్లో బరిలోకి దిగనున్న సీపీఎం

కేరళంసహా నాలుగు రాష్ట్రాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేరళలో అధికార ఎల్డీఎఫ్ (లెఫ్ట్ డెమొక్రటిక్ పార్టీ) కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన సీపీఎం తన అభ్యర్థుల్ని ప్రకటించింది. నోటిఫికేషన్ వెలువడిన కొద్దిసేపటికే సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంజీ గోవిందన్.. తమ పార్టీ అభ్యర్థుల వివరాల్ని వెల్లడించారు. సీపీఎం సభ్యుడైన కేరళం సీఎం పినరయి విజయన్ ధర్మదాం నుంచి పోటీ చేయనున్నట్లు గోవిందన్ వెల్లడించారు. ప్రస్తుతం పినరయి విజయన్ ఇదే స్థానం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. అలాగే మొత్తం 140 సీట్లకుగాను, 86 సీట్లలో సీపీఎం పోటీ చేయనుంది. అందులో 56 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ అవకాశం ఇచ్చింది. ప్రస్తుతం 86 సీట్లకుగాను 75 మంది అభ్యర్థుల్ని ప్రకటించింది. అలాగే పార్టీ అభ్యర్థులే అయినప్పటికీ ఆరుగురు ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తారు. మొత్తంగా 81 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. మిగతా ఐదు నియోజకవర్గాలకు చెందిన వారి వివరాల్ని రెండు రోజుల్లో వెల్లడిస్తారు. మరోవైపు ఎల్డీఎఫ్ కూటమిలోని రెండో ప్రధాన పార్టీ అయిన సీపీఐ కూడా 25 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వమ్ జాబితాను వెల్లడించారు. మిగతా పార్టీలు కూడా త్వరలోనే అభ్యర్థుల్ని ప్రకటిస్తాయి. కేరళంలో ఒకే దశలో ఏప్రిల్ 9న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత మే 4న ఫలితాలు వెల్లడవుతాయి. కేరళంలో అధికారం దక్కాలంటే 71 సీట్లు దక్కించుకోవాలి.

# నోటిఫికేషన్‌కు ముందు మమతా బెనర్జీ కీలక నిర్ణయం.. పెండింగ్ డీఏ విడుదల

పశ్చిమ బెంగాల్ సహా నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి ఆదివారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. అయితే, ఈ నోటిఫికేషన్ విడుదలవ్వడానికి కొన్ని గంటల ముందు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏ బకాయిలు విడుదల చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ మొదలైనట్లు మమతా బెనర్జీ వెల్లడించారు. దీనివల్ల ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. విద్యా సంస్థల్లోని టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, పంచాయతీలు, మున్సిపల్ సంస్థలు, ఇతర సంస్థల ఉద్యోగులకు ఈ డీఏ విడుదల వర్తిస్తుంది. ఈ నెల నుంచే ఉద్యోగులకు డీఏ అందుతుంది. మరోవైపు రాష్ట్రంలోని పురోహితులకు, మసీదుల్లోని ముయెజ్జిన్‌లకు అందిస్తున్న గౌరవ వేతనాన్ని కూడా పెంచారు. ప్రస్తుతం అందిస్తున్న రూ.1,500కు అదనంగా మరో రూ.500 అందించనున్నట్లు తెలిపారు. ఇకపై వారికి రూ.2,000 గౌరవ వేతనం అందుతుంది. ఈ పెంపుపై ప్రభుత్వానికి వారు చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మమత తెలిపారు. అయితే, ఈ నిర్ణయాల్ని మమత.. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి కొన్ని గంటల ముందు తీసుకోవడం విశేషం. వీటికి సంబంధించిన ఆదేశాలు జారీ అవ్వడం, ఆర్థిక శాఖ ఆమోదం తెలపడం, ఈ ప్రక్రియ మొదలవ్వడం జరిగిపోయింది. దీంతో ఈ నిర్ణయాలపై ఎన్నికల నోటిఫికేషన్ ఎఫెక్ట్ పడదు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉంటుందనే సంగతి తెలిసిందే.

# మోగిన అసెంబ్లీ ఎన్నికల నగారా

ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కూడా ఈసీ పూర్తిచేసింది. క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లో పర్యటించింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు షెడ్యూల్ ప్రకటించారు. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో కలిపి మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. అందులో తమిళనాడులో 234, పశ్చిమబెంగాల్‌లో 294, కేరళలో 140, అస్సాంలో 126, పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇక మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల కోసం 2.19 కోట్ల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ విధుల్లో మొత్తం 25 లక్షల మంది అధికారులు పాల్గొననున్నారు.

# ఆధారాలు బయటపెడితే నన్ను బదనాం చేస్తారా

ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు మూసీపై కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్‌ను ఎందుకు విడుదల చేయట్లేదని ప్రశ్నించారు. ఫేజ్- వన్‌కి సంబంధించిన డీపీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చూపెట్టిందని ప్రస్తావించారు. పూర్తి డీపీఆర్ ఇవ్వకపోవడం వెనుక మోసం ఉందని ఆరోపించారు. ప్రీ ఫీజబులిటీ రిపోర్టులో రూ.5,641 కోట్లు ఖర్చు అవుతుందని ఈ ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. ఆరు నెలల తర్వాత దాదాపు రూ.1400 కోట్ల అంచనా ఎందుకు పెరిగిందని కవిత నిలదీశారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంత ఖర్చు అవుతుందో.. ఆ ఖర్చు మొత్తం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి నుంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టు ప్రజెంటేషన్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, మంత్రులను పిలిచారని అన్నారు. కానీ మూసీలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులను ప్రజెంటేషన్‌కు ఎందుకు పిలవలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో చిన్న మోదీలా.. రేవంత్‌రెడ్డి వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. మూసీ పేరుతో సీఎం గ్రాఫిక్స్ చూపెట్టారని సెటైర్లు గుప్పించారు. 16 నాలాల నుంచి మూసీలోకి మురుగు నీరు వస్తోందని చెప్పుకొచ్చారు. నగరంలో ఉన్న వ్యర్థాలన్నీ మూసీలోకి వెళ్తున్నాయని తెలిపారు. హైడ్రాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి అరాచకం చేస్తున్నారని కవిత ఆగ్రహించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఇప్పటివరకు ఆరు ఫిర్యాదులు చేశామని ప్రస్తావించారు. హైడ్రా కమిషనర్, ప్రభుత్వంపై పరువు నష్టం దావా వేస్తానని అన్నారు. నాలాలు ఆక్రమించి విల్లాలు కడుతున్న సంస్థ తమ పరిధిలోకి రాదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎలా చెబుతున్నారని ఫైర్ అయ్యారు. సిగ్గు లేకుండా రంగనాథ్ హైడ్రా వీడియోలు తీసి పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇష్టం వచ్చినట్లుగా వీడియోలు పెడుతున్నారని.. మీరేమైనా కంటెంట్ రైటర్లా ...? అని ధ్వజమెత్తారు. తాను ఆధారాలు బయటపెడితే హైడ్రా, కాంగ్రెస్ ప్రభుత్వం బాయిలో దూకాలని కవిత ఎద్దేవా చేశారు. తాను ఆధారాలు బయటపెడితే ఈ ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి తనను బదనాం చేస్తారా...?, తమాషాలు చేస్తున్నారా..? అని ఆగ్రహించారు. హైడ్రా పెట్టిన ట్వీట్స్ వెంటనే డిలీట్ చేయాలని.. లేకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లలో అసలైన బాధితులకు ఇళ్ల పట్టాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. అందులో కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలకు ఇచ్చారనే విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. త్వరలో వెలుగుమట్లలో పర్యటిస్తానని కవిత స్పష్టం చేశారు.


# కర్ణాటకలో 'ఆపరేషన్ లోటస్'..

## ఒడిశా ఎమ్మెల్యేలకు డబ్బు ఎర, ఇద్దరు అరెస్ట్

బెంగళూరు: రాజ్యసభ ఎన్నికలకు ముందు కర్ణాటకలో 'ఆపరేషన్ లోటస్'కు బీజేపీ ప్రయత్నించిందని డిప్యూటీ సీఎం శివకుమార్ విమర్శించారు. ఇక్కడకు తరలించిన ఒడిశా ఎమ్మెల్యేలకు రూ.5 కోట్లు చొప్పున ఆఫర్ చేసినట్లు ఆరోపించారు. క్రాస్ ఓటింగ్ కోసం లంచం ఇవ్వజూపిన వారిలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. (దీర్రూ'ం రాజూ రాశీబం) మార్చి 16న రాజ్యసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఒడిశాలోని అధికార బీజేపీ ప్రలోభాల నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన 8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ సీనియర్ నేతలను బెంగళూరులోని రిసార్ట్‌కు తరలించారు. కాగా, ఒడిశా బీజేపీకి చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం ఒడిశా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రిసార్ట్‌లో సంప్రదించినట్లు డిప్యూటీ సీఎం శివకుమార్ ఆరోపించారు. రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కోసం ఒక్కొక్కరికి రూ.5 కోట్ల చొప్పున వారు ఆఫర్ చేసినట్లు ఒడిశా ఎమ్మెల్యేలు చెప్పారన్నారు. 'కర్ణాటకలో బీజేపీ స్నేహితులు నిర్వహించిన గొప్ప 'ఆపరేషన్ లోటస్' ఇది. వారు ఖాళీ చెక్కును అందించడం ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యేతో చర్చలు జరుపడానికి ప్రయత్నించారు' అని అన్నారు. నలుగురు వ్యక్తుల్లో ఇద్దరు అరెస్టైనట్లు వివరించారు. మరోవైపు ఒడిశా కాంగ్రెస్ శాసనసభ పక్ష ఉప నాయకుడు అశోక్ కుమార్ దాస్, బిడది పోలీస్ స్టేషన్‌లో దీనిపై ఫిర్యాదు చేశారు. తమ ఎమ్మెల్యేలను నలుగురు వ్యక్తులు సంప్రదించారని, రాజ్యసభ ఎన్నికల్లో ఒక బీజేపీ అభ్యర్థికి అనుకూలంగా క్రాస్ ఓటు వేయడానికి వారికి డబ్బు ఆశ చూపారని ఆరోపించారు. అయితే తమ ఎమ్మెల్యేలు ఈ ఆఫర్‌ను తిరస్కరించినప్పుడు, వారు ఒడిశాకు తిరిగి వస్తే చంపేస్తామని ఆ వ్యక్తులు బెదిరించినట్లు అశోక్ కుమార్ దాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తులను ఒడిశాకు చెందిన బిరేంద్ర ప్రసాద్, సురేష్, అజిత్ కుమార్ సాహు, సిమాచల్ మోహకుడ్‌గా ఆయన గుర్తించారు. కాగా, ఈ ఆరోపణలను ఒడిశా బీజేపీ ఖండించింది. రాజ్యసభ ఎన్నికల్లో తమ ఓటమి ఖాయమని గ్రహించిన తర్వాతే కాంగ్రెస్ నేతలు ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఒడిశా బీజేపీ ప్రతినిధి అనిల్ బిస్వాల్ మీడియాతో అన్నారు. క్రాస్-ఓటింగ్‌కు పాల్పడటం కాంగ్రెస్‌కు అలవాటని ఆయన విమర్శించారు.

# ఇప్పటికే దివాలా.. ఈ బడ్జెట్ ఎలా?

'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సూక్తి మనిషికే కాదు.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకూ వర్తిస్తుంది. బీఆర్ఎస్ హయాంలో 2023-24 ఆర్థిక



ఆరోగ్య సూచీ (ఎఫ్‌హెచ్ఐ) తెలంగాణ ఆర్థిక ఆరోగ్యం ఫిట్‌గా ఉన్నట్టు ధ్రువీకరించింది. గణాంకాలను బేరీజు వేసుకుంటూ వచ్చే బడ్జెట్‌లో కేటాయింపులు జరిగితే, తెలంగాణ ఆర్థికంగా మరింత ధృడంగా మారడం ఖాయం. మనుషులు ఆరోగ్యంగా ఉన్నారో లేరో తెలుసుకోవడానికి రక్త పరీక్షలు, షుగర్ లెవల్స్, ఈసీజీలు ఎలాగో.. ఒక రాష్ట్రం ఆర్థికంగా ఎంత పటిష్టంగా ఉందో చెప్పడానికి ఆర్థిక ఆరోగ్య సూచీ అలాగే. హెల్త్ రిపోర్టుల ఆధారంగా చికిత్స కోసం డాక్టర్లు ప్రిస్కిప్షన్ రాస్తారు. అలాగే రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య పరిపుష్ఠికి బడ్జెట్‌లో కేటాయింపులు, ఖర్చులు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 16 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తాజాగా విడుదలైన 2023-24 నివేదికలు ప్రభుత్వానికి దిక్సూచిలా మారనున్నాయి. 2034 నాటికి తెలంగాణ ట్రిలియన్ (లక్ష కోట్ల) డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, దేశ స్వాతంత్ర్య శతాబ్ది వేడుకలు జరుపుకొనే నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవడమే లక్ష్యమని చెప్పుకొంటూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్-విజన్ 2047 డాక్యుమెంట్‌ను ప్రకటించింది. 'చేతిలో పైసా ఉంటే కొండ మీది కోతినైనా దించవచ్చు' అంటారు. కానీ, ఆ పైసా సంపాదించడం ఎలా అన్నది ముఖ్యం. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేవలం జీతాలు, పెన్షన్లకే పరిమితం కాకుండా, ఆస్తుల సృష్టిపై దృష్టి సారించింది. 2019-20లో రూ.16,860 కోట్లుగా ఉన్న మూలధన వ్యయాన్ని 2023-24 బడ్జెట్ నాటికి రూ.43,918 కోట్లకు (దాదాపు 160 శాతం) పెంచింది. సాగునీటి ప్రాజెక్టులు కట్టి నీటిని అందించడం ద్వారా సాగు విస్తీర్ణం పెరిగి ఆదాయం వృద్ధి సాధ్యమైంది. ఆర్థిక వనరులను వృద్ధి చేసుకోవడంపై దృష్టి పెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం సత్ఫలితాలు సాధించింది. రాష్ట్ర సొంత పన్ను ఆదాయాన్ని 74 శాతం నుంచి 80 శాతానికి పెంచుకోవడం ద్వారా కేంద్ర గ్రాంట్లపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం పన్నేతర ఆదాయం ఏటా 33 శాతం చొప్పున పెంచుతూ రాష్ట్రాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించింది. 'అప్పు లేనివాడే అధిక సంపన్నుడు' అనేది పాత మాట. నేటి ఆర్థిక ప్రపంచంలో అప్పు తీర్చగలిగే శక్తి ఉండటమే గొప్పమాట. కేసీఆర్ ప్రభుత్వం అప్పు తెచ్చిన నిధులతో భారీ ప్రాజెక్టులు నిర్మించి, రైతులు పెద్దఎత్తున పంటలు పండించేలా ప్రోత్సహించింది. తెలంగాణ గ్రామాల్లో ఎన్నో రెట్ల సంపద సృష్టించింది. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. రాష్ట్ర సంక్షోభంపై సీఎం రేవంత్‌రెడ్డి పలు వేదికల పై చెప్పారు. ఇక ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకొనే దిశగా చర్యలు ఉండాలి. ఆదాయ వనరుల వేట పెంచాలి. కానీ కొత్త ఆదాయ మార్గాలను రేవంత్ సర్కార్ అన్వేషించడంలేదు. గనులు, భూముల అమ్మకాల ద్వారా కాకుండా స్థిరమైన పన్నుయేతర ఆదాయ మార్గాలను సృష్టించుకోవాలి. ఆదాయాన్ని రెవెన్యూ ఖర్చులకు కాకుండా మూలధన వ్యయాన్ని పెంచే దిశగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలి. రాష్ట్రానికి పారిశ్రామిక వికేంద్రీకరణ కూడా ఎంతో అవసరం. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ శ్రేణి నగరాల్లో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలి. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించే శక్తులుగా మార్చాలి. ఆస్తులను సృష్టించే మూలధన వ్యయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడి ఉన్నది. కేసీఆర్ అప్పులు చేసినా మిషన్ భగీరథ, కాళేశ్వరం వంటి భారీ ఆస్తుల సృష్టిపై దృష్టి పెట్టారు. కానీ కాంగ్రెస్ సర్కార్ రెండేండ్లలో చేసిన దాదాపు రూ.3 లక్షల కోట్ల అప్పు ఏమి చేసిందంటే చెప్పడానికి ఏమున్నది? 2023-24 ఎఫ్‌హెచ్ఐ నివేదిక, రెండేండ్ల కాగ్ గణాంకాలను పరిశీలిస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ సరార్‌కు మధ్య స్పష్టమైన వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. సంక్షేమం-మౌలిక సదుపాయాల సమతుల్యత కోసం కేసీఆర్ ప్రణాళికలు అమలు చేశారు. కానీ రేవంత్‌రెడ్డి పాలనలో అప్పులు తప్ప పనులు కనిపించడం లేవు. రెవెన్యూ ఖర్చులు పెరిగాయి. రాష్ట్ర అభివృద్ధికి కొలమానమైన 'మూలధన వ్యయం' గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గుముఖం పట్టింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేసీఆర్ సర్కార్ మూలధన వ్యయం కింద రూ.44,275.14 కోట్లు వెచ్చించింది. బడ్జెట్ అంచనాలు పెరిగినప్పటికీ 2025-26లో జనవరి వరకు రేవంత్ సర్కార్ రూ.44,376.34 కోట్లే మూలధన వ్యయం కింద ఖర్చుచేసింది. కాంగ్రెస్ పాలకులు భూములు అమ్మి ప్రభుత్వాన్ని ఎంతకాలం నడుపుతారు? బడ్జెట్ కేవలం అంకెల గారడీ కాదు. అది ప్రజల ఆశల ప్రతిరూపం. ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, ఉత్పాదక రంగాలపై దృష్టి సారించాలి. అప్పుడే ఆర్థిక ఆరోగ్యమే మహాభాగ్యం అని తెలంగాణ గర్వంగా చాటుకోగలదు. లేకపోతే రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో దివాలా తీసిన రాష్ట్రం, మరింత దారుణమైన సంక్షోభం ఎదుర్కోకతప్పదు.

# పార్లమెంట్ మెట్లపై టీ, పకోడీ

టీ, పకోడీ తీసుకోవడంపై అమిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ అనేది చాలా పవిత్ర స్థలమని, అల్పాహారం ఎక్కడ తీసుకోవాలో కూడా రాహుల్‌కు తెలియదా అని ప్రశ్నించారు. రాహుల్ చర్యలను ఏ భారతీయుడూ సమర్థించడని అన్నారు. ప్రస్తుతం అస్సాం పర్యటనలో ఉన్న హోంమంత్రి అమిత్ షా ఆ రాష్ట్ర వైద్యారోగ్య రంగానికి సంబంధించి రూ.2 వేల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ప్రసంగిస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ గత పాలనపై విమర్శలు గుప్పించారు. 'గత పదిహేనేళ్ల పాలనలో కాంగ్రెస్ అస్సాం వైద్యారోగ్య బడ్జెట్ నుంచి రూ.150 కోట్లు కాజేసింది. ఆ పార్టీ కేవలం తమ కుటుంబాల పాలన కోసమే పని చేసింది. ఆ సమయంలో రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది' అని అమిత్ షా విమర్శించారు. అస్సాం రాష్ట్రంలోని వైద్య సదుపాయాలను గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల స్థాయికి తీసుకురావడానికి సీఎం హిమంత బిశ్వశర్మ ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కాగా, త్వరలో అస్సాం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో హోం మంత్రి అమిత్ షా తరచుగా పర్యటనలు చేస్తున్నారు.

# ఈ నెల 22న రైతు భరోసా మొదటి విడత నిధులు..!

రెండో విడతగా మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడతగా మొత్తం రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్టు సమాచారం. ఈ క్రమంలో మొత్తం మూడు విడతల్లో కలిపి రైతుల ఖాతాల్లోకి చేరనున్న సుమారు రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమకానున్నాయి.

# పుట్టా మహేశ్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి: సీపీఎం

మొయినాబాద్ డ్రగ్స్ వ్యవహారంలో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీపీఎం ఓ ప్రకటన విడుదల చేసింది. పుట్టా మహేశ్‌ను పార్లమెంట్ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించాలని సీపీఎం నేత శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మహేశ్‌పై చర్యలు తీసుకుని డ్రగ్స్ నివారణలో తమ చిత్తశుద్ధిని తెలుగుదేశం పార్టీ నిరూపించుకోవాలని సూచించారు. బాధ్యతాయుత పదవిలో ఉన్న పుట్టా మహేశ్ డ్రగ్స్ పార్టీలో పాల్గొని తన హోదాను దుర్వినియోగం చేశాడని, తక్షణమే అతడి పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓ ఎంపీ పట్టుబడడం ద్వారా రాజకీయ నాయకులకు, డ్రగ్స్ మాఫియాకు ఉన్న బంధం మరోసారి బహిర్గతమైందన్నారు. రాజకీయ నాయకుల మద్దతు లేకుండా డ్రగ్స్ వ్యాపారం , విస్తరణ జరగడం లేదని, ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న డ్రగ్స్ వ్యాపారులను, మద్దతు దారులను రాజకీయాల నుంచి బహిష్కరించి తమ నిబద్ధతను రుజువు చేసుకోవాలని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# విలువలేని విద్యా కమిషన్ రిపోర్ట్!

తెలంగాణ విద్యాశాఖ కమిషన్ రూపొందించిన తెలంగాణ విద్యా విధానం- 2026 నివేదిక విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఎన్నో సందేహాలను మిగిల్చింది. కమిషన్ రిపోర్టు కన్ఫ్యూజన్‌గా ఉన్నది. త్రిభాషా అమలు ప్రతిపాదనలో మాతృభాష కంటే ఆంగ్ల భాషకే ప్రాధాన్యత నిచ్చే విధంగా కమిషన్ సూచనలు చేయడం, ప్రీప్రైమరీ విద్య నుంచి తప్పనిసరిగా ఆంగ్ల భాషలోనే బోధించాలని కమిషన్ ప్రతిపాదించడం విడ్డూరంగా ఉన్నది. మాతృభాష పరిరక్షణకు కమిషన్ ఎటువంటి ప్రతిపాదన చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అందరిలో సందేహాలను మిగిల్చింది. తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక విమర్శలకు గురవుతున్నది. స్కూల్ ఎడ్యుకేషన్ ప్రతిపాదనలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుతో మాత్రమే మెరుగైన ఫలితాలు సాధించగలమని, ప్రస్తుతం నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలను రద్దు చేయడమే ప్రత్యామ్నాయమని ప్రతిపాదించింది. కానీ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి చేయడం ప్రభుత్వ బాధ్యత అని కమిషన్ సూచించలేదు. కొత్తగా రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేయకూడదని, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మినీ గురుకులాలను రద్దు చేయాలని, అన్ని సొసైటీల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను కూడా తీసేయాలని ప్రతిపాదించడం చాలా దారుణం.తెలంగాణ వార్తలు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ బోర్డులను కలపాలన్న ప్రతిపాదన అర్థరహితం. కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాసే విధంగా, గ్రామీణ ప్రాంత విద్యాసంస్థలు, విద్యార్థులకు ప్రతికూలం. 12వ తరగతికి మాత్రమే బోర్డు పరీక్ష నిర్వహించాలని, ఎప్‌సెట్ పరీక్షను రద్దుచేసి 12వ తరగతి మార్కుల ఆధారంగానే ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ సీట్లను కేటాయించాలని కమిషన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనతో జాతీయస్థాయిలో నిర్వహించే నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షల్లో రాష్ట్రం నుంచి ఉత్తీర్ణత సాధించే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గే ప్రమాదం ఉన్నది. 12వ తరగతి వరకు ఉత్తీర్ణత మార్కులు 45 శాతం యూజీ/పీజీ ఉత్తీర్ణత మార్కులు 50 శాతానికి పెంచడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతారు. ఈ ప్రతిపాదన గ్రామీణ ప్రాంత విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పాలిటెక్నిక్ విద్యను ఇంజినీరింగ్ లేటరల్ ఎంట్రీలో బంద్ చేయడం, ఇంటర్మీడియట్‌తో సమానంగా విద్యార్హతను కల్పించాలని చెప్పడం వింతగా ఉన్నది. 15 వందల మంది విద్యార్థులతో కూడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు అనుబంధంగా 200 మంది విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కమిషన్ నివేదికలో సూచించింది.

# సంపాదకీయం

## రైతు ఆత్మహత్యల నిరోధంలో నిర్లక్ష్యం !

ప్రభుత్వాలు గొప్పగా రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని, పంటపెట్టుబడులు అందిస్తున్నా మని, రుణమాఫీలు చేస్తున్నామని ప్రకటించుకుంటోంది. అలాగే నీటి తీరువా రద్దు, ఉచిత విద్యుత్ సౌకర్యాలుకూడా అందిస్తున్నామని చెబుతోంది. ఎన్నిచేసినా పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. పండిన పంటల కొనుగోళ్లు సకాలంలో సజావుగా సాగడం లేదు. బీమా పథకాలు అందడం లేదు. ఈ సమస్యలపై ప్రభుత్వాలు చర్చించడం లేదు. అందుకే దేశంలో మొత్తం ఆత్మహత్యల్లో 11 శాతం రైతులవే ఉంటున్నాయి. ఆత్మహత్యల రేటులో ప్రతి లక్షమంది జనాభాకు రైతులు 1.4 శాతం మంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అభివృద్ధిచెందిన రాష్ట్రాలైన దక్షిణాదిలోనే అత్యధికంగా రైతు ఆత్మహత్యలు ఉన్నాయి. పంటనష్టం,దివాళా, వ్యవసాయ సంబంధ సమస్యలు రైతు ఆత్మహత్యలకు ప్రధాన కారణాలని కేంద్రం విశ్లేషించింది. రైతుల ఆత్మహత్యలపై ప్రబుత్వాలు సీరియస్‌గా ఆలోచించడం లేదు. ఎందుకిలా జరుగుతుందో చర్చించడం లేదు. కూలీ రేట్లు అధికమవ్వడం, వాతావరణ దుష్పరి ణామాలు, ధరలు పెరుగుదల వంటివి కూడా కర్షకుల ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. పేద రైతులు ప్రధానంగా అప్పులపై ఆధారపడి వ్యవసాయం చేస్తారు. తక్కువ సమయంలోనే అప్పులు చెల్లించాల్సి ఉండటంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.అధిక వడ్డీరేట్లు ఉండటం, మొదటి దఫా అప్పు చెల్లించక పోవడంతో రెండోదఫా నిరాకరించ డం, రైతులకు ఇవ్వాల్సిన రుణాలను ఇతర రంగాలకు మళ్లించడం వంటివి కూడా సమస్యలుగా మారుతు న్నాయి. రైతులకు కొంత మొత్తంలోనే రుణాలిచ్చిన బ్యాంకులు.. రుణమాఫీని కూడా క్రమశిక్షణా రాహిత్యం గా చూపుతున్నాయి. అది ఆర్థిక వ్యవస్థకు మంచిదికాదని ప్రభుత్వాలకే హితవు చెబుతున్నాయి. జీవన వ్యయం రోజురోజుకు పెరిగిపోతుండటంతో దాన్ని అందుకోలేని రైతు ఆత్మహత్యే శరణ్యం అనుకుం టున్నాడు. రైతులకు వచ్చే అరకొర ఆదాయంతో కనీస అవసరాలు తీర్చుకోలేక, ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు లభించక వ్యవసాయ వృత్తిలోనే కూరుకు పోవడంతో రైతు తీవ్ర మానసిక క్షోభతో ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని అర్థం చేసుకోవచ్చు. అప్పు అనేది సామాజికంగా రైతును కుంగదీస్తుంది. తనకు వచ్చే ఆదాయంతో అప్పు తీర్చలేకపోతున్నాడు. దీనికి తోడు కుటుంబ ఖర్చులు పెరుగుతున్నాయి. గతంలో మాదిరిగా ఇంటిల్లిపాది వ్యవసాయ పనుల్లో పాలుపంచు కునే పరిస్థితులు ఇప్పుడు లేవు. దీంతో కుటుంబ సభ్యులను సంతృప్తి పరచలేక.. పరువు పోతోందనే ఆవేదనతో..నిస్సహాయ స్థితిలో రైతులు ఆత్మహత్యల కు పాల్పడుతున్నారు. ఆత్మహత్యలు ఆగాలంటే.. పంటలకు గిట్టుబాటు ధరను కల్పించడం చాలా కీలకం. రైతు హక్కులు కూడా మానవ హక్కులే. దానిపై ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలి. వ్యవస్థాగత రుణాలు కల్పించాలి. రైతులకు సరైన శిక్షణ ఇచ్చి లాభాలు పొందేటట్టు చేయాలి. సామాజికం గా పౌరులు, మీడియా, ఇతర స్వచ్ఛంద సంస్థలు రైతు సమస్యలను తీవ్రమైన, ముఖ్యమైన అంశంగా పరిగణించి ఆత్మహత్య నివారణ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. రైతులేని రాజ్యం నిలువదు. రైతుని కాపాడుకుంటేనే దేశం సస్యశ్యామలం అవుతుంది. అందుకే రైతుల ఆత్మహత్యలను నిరోధించి, రైతుకు ముఖ్యమైన స్థానం ఇచ్చి కాపాడాల్సిన అవసరం తక్షణావసరంగా గుర్తించాలి. మనదేశం వ్యవసాయ ఆధారిత దేశం కావడంతో దాదాపు 83 కోట్ల మందికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. 70 శాతం గ్రామీణ మహిళలు వ్యవసాయం జీవనాధారంగా జీవిస్తున్నారు. 1991లో వచ్చిన సంస్కరణల తర్వాత మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కలు చెబుతున్నాయి. దేశంలో రోజుకు సగటున 46 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అంటే ప్రతి అరగంటకు ఒక రైతు చనిపోతున్నాడని అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయం అసంఘటిత రంగంలో ఉండటంతో పథకాలు కూడా లబ్ధిదారులకు సరిగా చేరడం లేదు. అందుకే తెలుగు రాష్ట్రాల్లో రైతులకు బాగానే చేయూత లభిస్తున్నా.. ఆశించిన ఫలితాలు రావడం లేదు. తెలంగాణలో, రుణమాఫీ, రైతు భరోసా లాంటి పథకాలున్నాయి. ఏపీలోనూ అన్నదాతకు ఆర్థిక సాయం అందుతోంది. అయినా సరే రైతులు నిలదొక్కుకోలేకపోతున్నారు. వ్యవసాయం లో పేరుకుపోయిన సమస్యలు కర్షకుల్ని కుంగదీస్తున్నాయి. అందుకు కేవలం ఆర్థిక సాయంతో అన్నదాతకు భరోసా ఇవ్వడం కుదరదని చాలామంది నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ దిగుబడుల విషయంలోనూ మన దేశం చాలా వెనుకబడి ఉంది. హరిత విప్లవం తర్వాత దిగుబడి పెరిగిన మాట నిజమే అయినా.. ఇతర దేశాలతో పోలిస్తే మన దగ్గర ఉత్పాదకత ఇంకా తక్కువ గానే ఉంది. ఇక పంటలు అమ్ముకోవడానికి రైతులు నానా యాతన పడుతున్నారు. మార్కెట్లల్లో తీవ్ర అవినీతి చోటు చేసుకుంటోంది. ప్రభుత్వాలు ఈ అవినీతిని కట్టడి చేయలేక చేతులెత్తేస్తున్నాయి. అందుకే ఏటా మద్దతు ధర ప్రకటిస్తున్న పంటలకు కూడా పూర్తిస్థాయి ఆ ధర దక్కడం లేదు. వ్యవసాయంలో మహిళలు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. కాబట్టి వారి సంక్షేమానికి ప్రత్యేక పథకాలు రూపొందించాలి. రుణాలు, రుణ హామీలు, రుణ బదిలీలు, మాఫీలు అన్నింటికి చట్టబద్ధత కల్పించి ప్రభుత్వాలు, బ్యాంకులు జవాబుదారీగా వ్యవహరిం చాలి. ప్రధానంగా వ్యవసానుబంధ రంగాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. కోళ్లపెంపకం, పశువుల పెంపకం, కూరగాయల సాగను ప్రోత్సహించాలి. వీటికి మార్కెట్ సౌకర్యం కల్పించాలి. రైతు సమస్యల పరిష్కారం లక్ష్యంగా 2004లో ప్రొఫెసర్ ఎంఎస్. స్వామినాథన్ అధ్యక్షతన జాతీయ రైతు కమిషన్ ఏర్పాటు చేశారు. పంటలకు మద్దతు ధరలపై శాస్త్రీయత ఉండాలనే అభిప్రాయం వచ్చింది. అనేక సూచనలు చేసింది. వాటిని ముందుగా అమలు చేయాలి. సుప్రీంకోర్టు రైతు ఆత్మహత్యల అంశాన్ని చాలా ప్రాధాన్యాంశంగా పరిగణించింది. రైతులు చనిపోయాక పరిహారం ఇచ్చి అదే పరిష్కారం అనుకోవడమే తప్పని సూత్రీకరించింది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మళ్లీ వాటిని చెల్లించకలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దశాబ్దాల తరబడి రైతులు చనిపోతున్నా ఆత్మహత్యల వెనుక అసలైన సమస్యను పరిష్కరించే చర్యలు లేకపోవడంపై సుప్రీం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అయితే సంక్షోభాల నివారణకు శాస్త్రీయ దృక్పథం అవసరం. అప్పుడే వ్యవసాయం పురోగమించ గలదు. ఆత్మహత్యలను నిరోధించగలం. ఉత్పత్తిని పెంచగలం. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన భాగస్వామిని చేయగలం.

# వ్యవసాయంపై కృత్రిమ మేధ ప్రభావం



### స్మార్ట్ వ్యవసాయం వైపు పరుగులు
### సాగులో కొత్త శకానికి ఆవిష్కరణల నాంది

న్యూఢిల్లీ,జూలై9 : ప్రపంచవ్యాప్తంగా నేడు ప్రతి రంగాన్నీ కృత్రిమ మేధ ప్రభావితం చేస్తోంది. వ్యవసాయ రంగంలోనూ ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. రాబోయే రోజుల్లో సాగు స్వరూపాన్ని ఏఐ పూర్తిగా మార్చివేసేలా ఆవిష్కరణలు జరుగుతున్నాయి. అనేక దేశాలు యాంత్రీకరణను దాటుకుని స్మార్ట్ వ్యవసాయం వైపు పరుగులు తీస్తున్నాయి. ఇండియాలోనూ అటు వైపు అడుగులు పడుతున్నాయి. కృత్రిమ మేధ, డేటా ఆధారిత పరిష్కారాలు సాగులో కొత్త శకానికి నాంది పలుకుతున్నాయి. 1960ల్లో వచ్చిన హరిత విప్లవంతో దేశీయంగా ఆహారోత్పత్తి గణనీయంగా పెరిగింది. అదే సమయంలో నీటికొరత, విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వంటి సవాళ్లను సాగురంగం ఎదుర్కొం టోంది. వీటికితోడు పంటలపై వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి, భవిష్యత్ తరాలకు ఆహారభద్రతను అందించడానికి కృత్రిమ మేధ, బిగ్‌డేటా అనలిటిక్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలు ఉపయోగపడతాయి.వ్యవసాయంలో స్థిరత్వం సాధించటానికి ఏఐ ముఖ్య సహాయకారిగా మారుతోంది. డ్రోన్లు, సెన్సర్లు తదితరాల ద్వారా రైతులు నేల ఆరోగ్యం, వాతావరణ పరిస్థితులు, పంట పెరుగుదల, తెగుళ్ల గురించి తెలుసుకోవచ్చు. ఈ సాంకేతికతలు వనరులను సమర్థంగా వినియోగించుకోవడానికి, నీటిపారుదల, పంటల రక్షణకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పడతాయి. ఏఐ ఆధారిత ముందస్తు విశ్లేషణల సాయంతో మార్కెట్ పోకడలను తెలుసుకొని, నష్టాలను తగ్గించుకోవచ్చు. నేల స్వభావం, పంట రకాలు, పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను ఏఐ సాంకేతికత సూచిస్తుంది. వాటిద్వారా పర్యావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంతోపాటు- పంటల ఉత్పాదకతను పెంచుకోవచ్చు. ఏఐ ఆధారిత చాట్‌బాట్‌లు, మొబైల్ యాప్‌లతో ఉత్తమ వ్యవసాయ విధానాలను అన్నదాతలకు తెలియజెప్పవచ్చు. సహజవనరుల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో ఏఐ, డేటా అనలిటిక్స్ కీలకపాత్ర పోషిస్తాయి. ఉపగ్రహ చిత్రాలు, భౌగోళిక సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా అటవీ నిర్మూలన, నేల క్షీణత, నీటి కాలుష్యాన్ని పర్యవేక్షించ వచ్చు. పర్యావరణ వ్యవస్థలను, జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ఇవి తోడ్పడతాయి.ప్రపంచ జనాభా 2050 నాటికి వెయ్యి కోట్లకు చేరుతుందని అంచనా. పెరిగే జనాభాకు అనుగుణంగా పంట దిగుబడులను సాధించాలి. ఆహార కొరతను అధిగమించడానికి ఉత్పాదకతను పెంచడమే పరిష్కారం. ఈ విషయంలో ప్రపంచంలోని చాలా దేశాలు అనేక సవాళ్లు ఎదుర్కొంటు-న్నాయి. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం వల్ల విత్తనాలు విత్తడానికి సరైన సమయాన్ని నిర్ణయించడం రైతులకు సవాలుగా మారింది. కృత్రిమ మేధ సహాయంతో కర్షకులు వాతావరణ పరిస్థితులను విశ్లేషించవచ్చు.?మన దేశంలో వ్యవసాయంలో ఏఐ, డేటా ఆధారిత అనువర్తనాలను విస్తృతంగా ఉపయోగించడానికి ప్రభుత్వ ఏజెన్సీలు, పరిశోధనా సంస్థలు, వ్యవసాయ సంఘాల సమష్టి కృషి అవసరం. ఇండియాలో ఎక్కువమంది చిన్న, సన్నకారు రైతులే. తమకున్న చిన్న కమతాల్లో ఆధునిక పరికరాలను వినియోగించడం వారికి సమస్యగా మారింది. భవిష్యత్తులో సాగు మొత్తం ఏఐ కేంద్రంగానే జరిగే అవకాశం ఉంది. దానికి అనుగుణంగా వ్యవస్థలను సమాయత్తం చేయడం ప్రభుత్వాల కర్తవ్యం.ఇంకా 50 శాతం పైగా ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అందువల్ల ఈ రంగంలో ఎంతగా ప్రోత్సాహం దక్కితే అంతగా పురోగతి లభిస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతంగా ఉంటుంది.

## బాలికల పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

నెల్లూరు : కోవూరులోని బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో ఏవైనా సమస్యలున్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆమె స్వయంగా పరిశీలించారు. విద్యార్థినులు ఆరు బయట కూర్చుని భోజనం చేయడం చూసిన ఎమ్మెల్యే గమనించారు. త్వరలోనే పాఠశాల ఆవరణలో డైనింగ్ హాల్ నిర్మించాలని అధికారులకు సూచించారు. భోజన నాణ్యతను పరీక్షించేందుకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్వయంగా విద్యార్థినుల మధ్య కూర్చుని వారితో కలిసి భోజనం చేశారు. వంటకాల రుచి, పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత విషయంలో ఎక్కడ కూడా రాజీ పడొద్దని నిర్వాహకులకు సూచించారు.

## వీసా గడువు ముగిసినా నగరంలోనే తిష్ట

### నైజీరియన్‌ను గుర్తించి తిప్పిపంపిన పోలీసులు

హైదరాబాద్ : నగరంలోని కొండాపూర్ ప్రాంతంలో అక్రమంగా నివాసం ఉంటున్న నైజీరియన్ జాతీయుడిని ఈగల్ టీమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యక్తిని విక్టరీ పుయామగన్ (34) అలియాస్ కెన్నీగా గుర్తించిన అధికారులు ఎనిమిదేళ్లుగా భారతదేశంలో ఎటువంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా నివసిస్తున్నట్లు నిర్ధారించారు. నిందితుడిని అనుమతులతో స్వదేశానికి డిపోర్ట్ చేశారు. పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. విక్టరీ అపుయామగన్ 2018లో ఘనా నకిలీ పాస్ట్‌పోర్ట్ సాయంతో భారత్‌లోకి ప్రవేశించాడు. మెడికల్ అటెండెంట్ వీసాపై తొలుత ఢిల్లీకి చేరుకున్న కెన్నీ.. ఆ తర్వాత పంజాబ్‌కు వెళ్లి అక్కడ కొంత కాలం జిమ్ ట్రైనర్‌గా పనిచేశాడు. అయితే, తన వీసా గడువు ముగిసినప్పటికీ అధికారులకు దొరక్కుండా అక్రమంగా దేశంలో ఉండిపోయాడు. 2025లో సినిమాల్లో నటించాలనే కోరికతో హైదరాబాద్ కు చేరుకున్న కెన్నీ.. ఇక్కడ జూనియర్ ఆర్టిస్ట్‌గా ప్రయత్నాలు మొదలుపెట్టాడు. తన శారీరక దారుఢ్యంతో ఇప్పటివరకూ సుమారు 5 సినిమాల్లో చిన్న పాత్రలు దక్కించుకున్నాడు.

## పేదలకు అందుబాటులోకి టిడ్కో ఇళ్లు

### ఉగాది నాడు అందించనున్న ప్రభుత్వం

తిరుపతి : సొంతిల్లు కట్టుకోవాలనే నిరుపేదల కలను నిజం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పండుగ ముందే అదిరిపోయే శుభవార్తను అందించింది. తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలోని బిరదవాడ వద్ద నిర్మించిన 2,064 టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తెలుగు కొత్త సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని, మార్చి 17న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ భారీ గృహ సముదాయాన్ని అధికారికంగా ప్రారంభించి, నిరుపేదలకు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం అందించే ఈ కానుకతో వందలాది కుటుంబాల్లో పండుగ వెలుగులు ముందే రానున్నాయి. ఈ ప్రాజెక్టు చరిత్రను పరిశీలిస్తే, గత టీడీపీ హయాంలోనే నాయుడుపేట పురపాలక సంఘం పరిధిలోని 36 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అప్పట్లోనే సుమారు 70 శాతం పనులు పూర్తయినప్పటికీ, తదనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు , ప్రభుత్వం మారడంతో ఈ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అయితే, ఇటీవల మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిచిపోయిన టిడ్కో ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. సుమారు రూ. 168 కోట్ల వ్యయంతో, నేషనల్ హైవే 16 పక్కన నిర్మించిన ఈ ఇళ్లలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి, సకల మౌలిక వసతులతో వీటిని సుందరంగా తీర్చిదిద్దింది. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయించాలనే లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం, ఈ నెల 17నే ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. సకల సదుపాయాలతో కూడిన ఈ ఇళ్లు అందుబాటులోకి రావడంతో లబ్దిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న క్రమంలో, ఈ టిడ్కో ఇళ్ల పంపిణీని ప్రభుత్వం ఒక మైలురాయిగా భావిస్తోంది. ఉగాది పండుగకు ముందే నిరుపేదలు తమ సొంతింటి గడప తొక్కబోతుండటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## తమిళ కవి వైరముత్తుకు జ్ఞానపీఠం

### అభినందనలు తెలిపిన స్టాలిన, కమల్ హాసన్


చెన్నై : సాహితీ పురస్కారాల్లో అత్యున్నతమైన జ్ఞానపీఠ్ పురస్కారానికి 2025వ ఏడాదికిగాను తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు పేరును ఎంపిక కమిటీ శనివారం ప్రకటించింది. ఆయనకు ముఖ్యమంత్రి స్టాలిన్, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ తదితరులు తమ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తేని జిల్లా మేట్టూర్‌లో 1953లో జన్మించిన వైరముత్తు కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన 'వైకరై మేఘంగళ్' కవితా సంకలనం అప్పట్లోనే ఓ మహిళా కళాశాలకు పాఠ్యాంశంగా మారింది. తమిళనాడు ప్రభుత్వ అధికారిక భాషా కమిషన్‌లో పని చేస్తున్నప్పుడే 1980లో దర్శక దిగ్గజం భారతీరాజా తెరకెక్కించిన 'నిళల్గళ్' చిత్రం ద్వారా సినీ గేయరచయితగా తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. కవితలు, నవలలు తదితర సుమారు 40 పుస్తకాలు, సినిమాలో సుమారు 7,500 పాటలు రాశారు. ఇప్పటికే ఆయన సాహిత్య అకాడమి, సాధన సమ్మాన్, పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ గేయ రచయితగా 7 సార్లు జాతీయ పురస్కారాలు అందుకున్న ఏకైక రచయిత ఆయన మాత్రమే. ఉత్తమ గేయ రచయితగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 6 సార్లు పురస్కారాలు అందుకున్నారు. జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ఇప్పటికే రాష్ట్రానికి చెందిన అఖిలన్ (1975), జయకాంతన్ (2002) అందుకోవడం గమనార్హం. జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపికైన వైరముత్తుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అభినందనలు తెలిపారు. 'తన కవితా పటిమతో తమిళ భాషను శాసిస్తున్న 'కవిపేరరసు' (కవి సామ్రాట్) వైరముత్తుకు జ్ఞానపీఠ్ పురస్కారం దక్కింది. ఈ రోజే నేను వైరముత్తును కలిసి మాట్లాడాను. ఆ భేటీ ముగిసిన కొద్దిసేపటికే ఈ తీపి కబురు రావడం ఆ సంతోషాన్ని మరింత రెట్టింపు చేసింది' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## తెలంగాణమంతా రామనామ యాత్ర

రంగడు వెలిసిన పుణ్యధామం పండరీపురం. ఆ పుండరీక వరదుడు కొలువుదీరిన అపర పండరి మన తెలంగాణలోనూ ఉంది. అదే సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని పాండురంగ ఆశ్రమం. భక్తులకు కొంగుబంగారమై విలసిల్లుతున్న ఆశ్రమం ఇప్పుడు శతకోటి రామనామ సంకీర్తనోద్యమానికి కేంద్రమైంది. ఈ నాదోపాసనలో పల్లెలన్నీ పల్లవిస్తున్నాయి. ఊరూరా ఆధ్యాత్మిక తరంగిణులు ఊరుతున్నాయి. ఒక్క గ్రామంతో మొదలైన భజనోత్సవంలో ఇప్పుడు వంద పల్లెలు భాగమయ్యాయి. రామనామామృతంలో పరవశిస్తున్నాయి. తెలంగాణ పండరిగా పేరొందిన పాండురంగ ఆశ్రమాన్ని వందేండ్లకు పూర్వం యతివర భావానంద భారతీ స్వామివారు నెలకొల్పారు. శతాబ్దం కిందట స్వామివారు 'రామనామ' సంకీర్తన ఉద్యమాన్ని నిర్విరామంగా నిర్వహించారు. స్వామివారి భక్తుడు రుక్మాభట్ల విధుమౌళి శాస్త్రి నేతృత్వంలో వంద భజన సంఘాలు ఏర్పడి, ఆనాడు భక్తి ఉద్యమాన్ని కొనసాగించాయి. తర్వాతి కాలంలో స్వామివారి పూర్వాశ్రమ కుమారుడు మహాత్మ అప్పాల విశ్వనాథ శర్మ 'భగవత్ సేవా సమాజం' సంస్థను స్థాపించి నామ సంకీర్తనను కొనసాగించారు. ఆ మహితాత్ములు ఏర్పరచిన దారుల్లో ఇప్పుడు భక్తి ఉద్యమం మళ్లీ పురుడు పోసుకున్నది. లోక కల్యాణం కోసం ఆశ్రమ నిర్వాహకులు సంకల్పించిన 'శతకోటి హరేరామ నామ జపయజ్ఞం'లో అశేష సంఖ్యలో భక్తులు భాగమవుతున్నారు. జగదేవపూర్ గ్రామంతో మొదలైన సంకీర్తన ఉద్యమం ఇప్పుడు వంద ఊళ్లలో నిర్విఘ్నంగా కొనసాగుతున్నది.

### నగర సంకీర్తనం

ప్రతి ఏకాదశికి సామూహిక నామ సంకీర్తన నిర్వహిస్తున్నారు. ఏకాదశి వేకువ జామునే ఆయా గ్రామాల్లోని భక్తులంతా ఒక్కచోటుకు చేరుకుంటారు. చిరుతలతో కొందరు, తాళాలతో ఇంకొందరు. అందరూ భక్తిభావంతో 'నగర సంకీర్తన'కు కదులుతారు. 'హరేరామ హరేరామ రామరామ హరేహరే హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే?' మహామంత్రాన్ని మనోహరంగా ఆలపిస్తూ ముందుకుసాగుతారు. ఊరంతా తిరిగి రాములవారి కోవెల దగ్గరో, అంజన్న ఆలయం దగ్గరో కాసేపు ఆగి భజన నిర్వహిస్తారు.



ఆధ్యాత్మికం

# "ఆపరేషన్ క్రాక్‌డౌన్" కరీంనగర్‌లో భారీ సైబర్ క్రైమ్ ముఠా గుట్టురట్టు 12 మంది నిందితుల అరెస్ట్




**కరీంనగర్ టౌన్, మార్చ్15(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో "ఆపరేషన్ క్రాక్‌డౌన్" ద్వారా సైబర్ నేరగాళ్ల గుట్టురట్టు చేసిన పోలీసుల చర్య అభినందనీయం. మ్యూల్ ఖాతాల ద్వారా జరుగుతున్న భారీ మోసాలను అరికట్టడంలో ఇది కీలక అడుగు. ఈ కేసులో పోలీసులు వెల్లడించిన మరిన్ని ముఖ్యాంశాలు స్వాధీనం చేసుకున్న వస్తువులు,నిందితుల నుంచి పోలీసులు పెద్ద సంఖ్యలో డెబిట్ కార్డులు, పాస్‌బుక్స్, మొబైల్ ఫోన్లు, వివిధ బ్యాంకుల సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా కేవలం స్థానికంగానే కాకుండా, ఇతర రాష్ట్రాల్లోని సైబర్ నేరగాళ్లకు కూడా ఈ మ్యూల్ ఖాతాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం, అపరిచిత వ్యక్తులకు తమ బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఇవ్వవద్దని కమీషన్ ఆశతో తమ ఖాతాలను ఇతరులకు వాడ నివ్వవద్దని సీపీ హెచ్చరించారు. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం పోలీసులు ప్రధాన నిర్వాహకుడు రాజేశ్వర్ రెడ్డి తో పాటు కరీంనగర్‌కు చెందిన మరో 11 మంది సహచరులను అదుపులోకి తీసుకున్నారు. ముదుగంటి రాజేశ్వర్ రెడ్డి, నందగిరి సాయి వర్ధన్, కాళిదాస్ కౌశిక్, ములంకుల రాజ్‌కుమార్, బండి సాయి కృష్ణ, అడవెల్లి సాయి కార్తిక్, మీర్ జామీ ఉద్దీన్, మహమ్మద్ జవాద్ ఖాన్, సర్దార్ దల్జీత్ సింగ్, పల్లెర్ల అజయ్, నిర్మల్ల శివ, దిద్దీ సాయి చరణ్, ఈ ముఠా సభ్యులు కేవలం ఒక్క కేసులోనే కాకుండా, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని ఇతర కేసులలో ఈ నిందితులు క్రింది కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించబడింది. కీలక పత్రాలు, బ్యాంక్ కిట్లు మరియు ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచారు. వీటిపై మరింత దర్యాప్తు కొనసాగుతోందని సీపీ తెలిపారు. పోలీస్ కమిషనర్ ప్రశంసలు: సమర్థవంతంగా పనిచేసి ఈ అంతరాష్ట్ర ముఠాను పట్టుకున్న కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి, ఎస్సైలు శ్రీనాథ్, పోచయ్య , సైబర్ క్రైమ్ ఎస్సై అనిల్, కానిస్టేబుల్ అనిల్, సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ నుండి వసీం, ఖాజా పాషా, రవి, వెంకటేష్, టూ మరియు త్రి టౌన్ లకు చెందిన హెడ్ కానిస్టేబుల్ కృష్ణా రెడ్డి, శ్రీనివాస్, శంకర్, లక్ష్మణ్, పోలీసు కానిస్టేబుళ్లు సాయి కృష్ణ, అభినవ్ పోలీస్ అధికారులను, సిబ్బందిని, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు విజ్ఞప్తి: తెలియని వ్యక్తులకు మీ బ్యాంక్ ఖాతాలు ఇవ్వడం, ఇతరుల కోసం అకౌంట్లు తెరవడం లేదా మీ ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులు ఇతరులకు అప్పగించడం చట్టరీత్యా నేరం. ఇలా చేయడం వల్ల మీరు కూడా సైబర్ నేరాలలో భాగస్వాములు అవుతారని, కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని కరీంనగర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఐటీ మంత్రి శ్రీధర్ బాబు





**భూపాలపల్లి/కాటారం/మార్చి -15:(ది క్రైమ్ న్యూస్):** కాటారం మండల కేంద్రంలోని ఎల్ జి గార్డెన్లో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో ఐటీ శాఖ మాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతోపాటు రాష్ట్ర ట్రేడ్ యూనియన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, కాటారం ఏఎంసీ చైర్మన్ పంతకాని తిరుమల - సమ్మయ్య, కార్యకర్తలు కుమ్మరి రమేష్, గజ్జల కిషోర్ ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించిన ఎర్రబెల్లి స్వర్ణ

- కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డి

**కరీంనగర్ టౌన్, మార్చ్15(ది క్రైమ్ న్యూస్):** ఎర్రబెల్లి స్వర్ణ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించిన ఈ సందర్భ పార్టీలో ఉత్సాహాన్ని నింపింది. ఈ కీలక కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డి పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్, ఇతర సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈ బాధ్యతల స్వీకరణకు హాజరయ్యారు. కర్ర సత్యప్రసన్న తో పాటు కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు మహిళా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. రాబోయే రోజుల్లో మహిళా గళాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వ పథకాలను మహిళల్లోకి తీసుకెళ్లడంపై ఈ సందర్భంగా చర్చించారు.





## చలివేంద్రాలు ప్రారంభించిన వి.హెచ్.ఆర్ ఫౌండేషన్..

- నియోజకవర్గ పరిధిలో మూడు చోట్ల చలివేంద్రాలు ప్రారంభించిన వ్యాల్ల హారీష్ రెడ్డి



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** గోదావరి ఖని ప్రధాన చౌరస్తాలో వి.హెచ్.ఆర్ ఫౌండేషన్ ద్వారా వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు వాహనదారులకు దాహార్తి తీర్చేందుకు చల్లటి త్రాగునీరు అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గ పరిధిలో ఆదివారం బి పవర్ హౌస్, గోదావరిఖని ప్రధాన చౌరస్తా అలాగే ఎనిమిదవ కాలనీలో చలివేంద్రాలు ప్రారంభించామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విహెచ్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాల్ల హరీష్ రెడ్డి తెలిపారు. బాటసారుల, వాహనదారులు, వృద్ధులు చల్లని త్రాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని హరీష్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జాహిద్ పాషా, యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడమల్ల శ్రీహరి, రోడ్డ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్, బ్రాహ్మణిల తనయుడు దేవాన్ష్ ధోతీ వేడుకలు



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్ నివాసంలో కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా దేవాన్ష్‌కు నూతన వస్త్రాలు బహుకరించారు. సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందమయ జీవితం సాగాలని ఆకాంక్షిస్తూ దేవాన్ష్‌ను ఆశీర్వదించారు.



## తెలుగు నూతన సంవత్సర ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ...



**కరీంనగర్ టౌన్, మార్చ్15(ది క్రైమ్ న్యూస్):** తెలుగు నూతన సంవత్సరం 2026 ఉగాది క్యాలెండర్ ను ఆదివారం రోజున కరీంనగర్లో మేయర్ కోలగని శ్రీనివాస్ ఆవిష్కరించారు. క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కరీంనగర్ విభాగ్ ప్రముక్ ఇప్ప లచ్చన్న మాట్లాడారు. సనాతన ధర్మములో ఈ క్యాలెండర్ కు మహోన్నతమైన ఉందని, ఆంగ్ల సంవత్సరం జనవరి నుండి కాకుండా ఉగాది నుండే నూతన సంవత్సర వ్యవహారాలు జరుగుతాయని తెలిపారు. ఈ క్యాలెండర్ ను కరీంనగర్ మేయర్ చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండ రమణారెడ్డి, జిల్లా ధర్మవరం నిధి ప్రముఖు లంబు సుధాకర్ రెడ్డి, అడ్వకేట్ కే ప్రభాకర్, ఫుల్ టైమర్ శంకర్, నరసయ్య, లక్ష్మీరాజ్యంతదితరులు పాల్గొన్నారు.

## 54 డివిజన్లో ఘనంగా పోచమ్మ బోనాల వేడుకలు





**కరీంనగర్ టౌన్, మార్చ్15(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ54 డివిజన్లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డివిజన్లోని మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాల కార్యక్రమంలో డివిజన్ సుంచు శ్రీనివాస్ (డిష్), సుంచు అనిల్, జెల్లీ కోటేష్ సుంచు అరవింద్ ,సుంచు మల్లయ్య సుంచు విద్యాసాగర్, వడ్లూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో 54 డివిజన్ కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి -వెంకటరమణ., కార్పొరేటర్ కల్లేపల్లి శారద. బాలరాజ్ లతోపాటు డివిజన్ ప్రజలు, మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## అంజన్న ఆశీర్వాద యాత్ర విజయవంతం చేసిన బిజెపి శ్రేణులకు ధన్యవాదాలు

- పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు



**కరీంనగర్ టౌన్,మార్చ్15(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తలపెట్టిన కొండగట్టు అంజన్న ఆశీర్వాద యాత్ర కోసం భారీ ఎత్తున తరలివచ్చి ప్రోగ్రాంను విజయవంతం చేసిన కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ శ్రేణులు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పార్లమెంట్ కన్వీనర్, కరీంనగర్ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు తెలిపారు.కరీంనగర్ మేయర్ పీఠం బిజెపికి అప్పగిస్తే కొండగట్టు అంజన్న స్వామి దర్శనానికి కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకుంటాననీ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం రోజున అంజన్న ఆశీర్వాద యాత్రను కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి పాదయాత్ర చేసిన బీజేపీ నుండి ఎన్నికైన వార్డు సభ్యులు, ఉపసర్పంచులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్ల లతో పాటు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బిజెపి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు, వివిధ మోర్చా బాధ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

## బీర్ తాగితే ఒంటికి చలువ చేస్తుందా..? కిడ్నీలో రాళ్లు కరుగుతాయా?

ఎండాకాలం వస్తే మద్యం ప్రియులు బీర్లు తెగ సేవిస్తారు. అదెంటి అంటే.. బీర్ తాగితే ఒంటికి చలవు చేస్తుందని చెబుతారు. కానీ ఇది ఎంతమాత్రం కరెక్ట్ కాదంటున్నారు డాక్టర్లు. అందుకు ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలు లేవంటున్నారు. అంతేకాదు బీర్ తాగితే గుండెకు మంచిదనే ప్రచారాన్ని కూడా కొట్టి పారేస్తున్నారు. ఇక కొందరు బీర్ తాగడం వల్ల కిడ్నీల్లో రాళ్లు తగ్గుతాయని చాలామంది నమ్ముతారు. ఇది నిజం కాదని నెఫ్రోలాజిస్ట్‌లు నొక్కి చెబుతున్నారు. అయితే బీర్ తాగేవారు లావు అవుతారు అనడంలో కొంతమేర వాస్తవం ఉంది. అయితే బరువు పెరిగేందుకు ఇది మంచి పద్ధతి కాదు. ఒక గ్రాము ఆల్కహాల్ సేవిస్తే 7 కేలరీలు శరీరానికి అందుతాయి. ఈ క్రమంలో బీర్ అధికంగా సేవిస్తే బరువు పెరుగుతారు. ఇక బీర్‌ను తలకు పట్టిస్తే.. షాంపులా వాడితే జుట్టు పెరుగుతుందన్నది మరికొందరి వాదన. జుట్టు కుదుళ్ల నుంచే బలంగా ఉండాలి. జుట్టుకు ఏదైనా రాసుకుంటే పెరుగుతుందనే దాన్ని సైన్స్ విశ్వసించదు అంటున్నారు డాక్టర్లు. ఆల్కాహాల్ కొద్ది మొత్తంలో తీసుకుంటే మంచిదని గతంలో పరిశోధనల్లో తేలింది. అయితే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్.. జనవరిలో విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఎంత మొత్తంలో ఆల్కాహాల్ తీసుకున్నా కూడా అది ఆరోగ్యానికి చేటే అని వెల్లడించింది. ఆల్కాహాల్ సేవనం పలు రకాల క్యాన్సర్లకు కారణం అవుతుంది. అయితే బీర్ కాకుండా ఇతర రకాల ఆల్కాహాల్ తీసుకునే వారికి లివర్ 5 ఏళ్లలో దెబ్బతింటే, బీర్ తాగే వారికి 10 సంవత్సరాల్లో దెబ్బతింటుందని కొందరు డాక్టర్స్ చెబుతున్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

● గ్రామపంచాయతీ సిబ్బందికి సన్మాన కార్యక్రమం మెడికల్ టెస్టులు ● పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్







**రామగిరి, మార్చి 15(ది క్రైమ్ న్యూస్):-** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగ పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్ అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఆదివారం పన్నూర్ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ చిందం మహేష్ ఆధ్వర్యం లో ఘనంగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామపంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య ఆతిదిగా మండల పంచాయతీ అధికారి సమ్మిరెడ్డి హాజరై మాట్లాడారు. వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా పరిశుభ్రత కోసం నిరంతరం కష్టపడి పనిచేసే కార్మికులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామంలోని అన్ని మురికి నీటి కాలువలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, డ్రై వేస్ట్ ఎక్కడా కనిపించకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించి కంపోస్ట్ ఎరువు తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, పీపీఈ కిట్లు,మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ఆతిదిగా మండల పంచాయతీ అధికారి సమ్మిరెడ్డి, ఎఎన్ఎం శారద, ఆశావర్కర్ లు శిరీష, సుమలత, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కల్వచర్లలో పోచమ్మ గుడికి భక్తుల సందడి

● ఉగాది ముందు అమ్మవార్లకు మొక్కుబడి చెల్లింపు

**రామగిరి, మార్చి 15(ది క్రైమ్ న్యూస్ ):-** రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని పోచమ్మ గుడి ఆవరణలోని మదనపు పోచమ్మ, బంగారు పోచమ్మ, మంకాలమ్మ లతోపాటు, దుర్గమ్మ-పెద్దదేవర దేవతల గుడికి భక్తులు తమ కుటుంబంతో వచ్చి భారీగా మొక్కులు చెల్లించారు. ప్రతి ఏడూ ఉగాది ముందు అమ్మవార్లకు ఆనవాయితీగా ప్రతి ఇంట బోనం వండి అమ్మవార్లకు నైవేద్యంగా అర్పిస్తారు. నైవేద్యంతో పాటు పసుపు, కుంకుమ, బెల్లం, చక్కర, పప్పులతో పాటు ఉల్లిగడ్డ, కోడిగుడ్డు, నిమ్మకాయలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించి, తమ మొక్కుబడి ప్రకారంగా కోళ్లు, మేకలను కోసి తమ కుటుంబసభ్యులు పిల్లాపాపలు, పాడి పంటలతో చల్లగా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు. తమ పిల్లల విద్యాభ్యాసం పరీక్షల సమయం కావడంతో అన్ని పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని, మంచి ర్యాంకులు సాధించాలని ప్రత్యేక పూజలతో అమ్మవార్లను కొలుస్తూ, ఉగాది ముందు చివరి



ఆదివారం సెలవుదినం కావడంతో కల్వచర్ల గ్రామస్తులే కాకుండా సింగరేణి సెంటినరీకాలనీ ప్రాంతం నుండి సందడిగా భారీగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి

● మార్చి 16న జరిగే. మహా ధర్నా జయప్రదం చేయండి ● సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టీయూ ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న





**రామగిరి, మార్చి 15(ది క్రైమ్ న్యూస్):-** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టీయూ ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో ఆర్.జీ-త్రీ డివిజన్ లో మార్చి 16న జరిగే మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి స్థానములో తెచ్చిన నాలుగు లేబర్ కోడులను ఏప్రిల్ ఒక్కటి నుండి అమలు చేయాలని గెజిట్ విడుదల చేసిందని ఈ నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా జరిగిన దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికుల పాల్గొని తీవ్ర నిరసనను, వ్యతిరేకతను తెలిపారని లేబర్ కోడులు కార్మికులకు ఎంతో నష్టకరమైనవని నాలుగు లేబర్ కోడుల పై కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో సమగ్ర చర్చలు జరుపకుండా కార్మిక సంఘాలతో చర్చించకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా అమలు చేయాలని చెప్పడం కార్పొరేట్లను సంతృప్తి పరచడానికే అని అన్నారు. దేశంలో కార్మిక వర్గాన్ని పెట్టుబడి దారులకు కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడలను సింగరేణిలో అమలు చేయవద్దని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జీ నర్సయ్య, జీ లింగయ్య, సంపత్, శ్రీనివాస్, రమేష్, సరి, సదానందం, రాజయ్య, ఓదెలు, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మీకు డయాబెటిస్ ఉందా..?


## రోజుకు రెండుసార్లు ఇలాంటి టీ తాగండి చాలు..!

పాలు, చక్కెర కలిపి తయారు చేసిన టీ తాగటం మానేస్తే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్న మాట. కానీ, డయాబెటిక్ పేషెంట్లు టీ ఎలా తాగాలో ప్రత్యేకించి చెబుతున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ డైట్ విషయంలో ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. షుగర్ లెవల్స్ మెయింటెయిన్ చేయడం తప్పనిసరి అంటున్నారు. షుగర్ బాధితులు దూరంగా ఉండాల్సిన ఆహారాల్లో టీ కూడా ఒకటి. ఇందులో పాలు, పంచదార ఉన్నందున దీనిని నివారించడం మంచిదని చెబుతున్నారు.. కానీ, డయాబెటిక్ పేషెంట్లు ఎలాంటి టీ తాగితే మేలు చేస్తుందో ఇక్కడ తెలుసుకుందాం.. 1. గ్రీన్ టీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు అత్యంత ఆరోగ్యకరమైన టీలలో గ్రీన్ టీ ఒకటి. గ్రీన్ టీలోనిపాలీఫెనాల్స్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అంతే కాదు, గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. 2.దాల్చిన చెక్క టీ దాల్చిన చెక్క టీ మధుమేహాన్ని నియంత్రించడంలో ఉత్తమమైనది. దాల్చినచెక్క రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దాల్చిన చెక్క టీ చేయడానికి, ఒక కప్పు నీటిలో దాల్చిన చెక్క చిన్న ముక్క వేసి కాసేపు మరగనివ్వాలి. ఆ తర్వాత టీకి బదులుగా తాగేయాలి. 3. మెంతి టీ డయాబెటిక్ బాధితులకు మెంతి టీ మరొక గొప్ప ఎంపిక. మెంతులలో ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర శోషణను తగ్గిస్తుంది. మెంతి టీ చేయడానికి, ఒక కప్పు వేడి నీటిలో ఒక చెంచా మెంతులు వేసి 10 నిమిషాలు అలాగే పక్కన పెట్టి తాగేయండి. రుచి కోసం కావాలంటే మీరు నిమ్మరసం కూడా యాడ్ చేసుకోవచ్చు. 4. వాముతో తయారు చేసిన టీ వాము జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. 5. తులసి టీ తులసి టీలో యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. తులసి ఆకులు హైపోగ్లైసీమిక్ ప్రభావాలను కలిగి ఉన్నాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. దీని కోసం, ఒక కప్పు వేడి నీటిలో కొన్ని తులసి ఆకులను వేసి 5 నిమిషాలు మూత పెట్టి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత రుచి కోసం కొంచెం తేనె కలుపుకుని తాగేయొచ్చు. చివరగా, మధుమేహులు ఇలాంటి టీ తాగుతున్నప్పుడు దానికి చక్కెర, లేదా తేనె కలుపుకోవడం మంచిదికాదు. రుచి కోసం కావాలంటే మీరు దాల్చినచెక్క పొడి లేదా ఏలకుల పొడి వేసుకుని తాగొచ్చు. మరీ ముఖ్యంగా ఇలాంటి ఇంటి చిట్కాలు, ఆయుర్వేద మందులు వాడే ముందు..మీరు మీ వైద్యుడిని సంప్రదించండి. దీనితో పాటు, ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, వైద్యుల సలహాలను అనుసరించడం చాలా ముఖ్యం.

## గుండె సమస్యలకు దానిమ్మ రసం దివ్యౌషధం..

# రోజుకి గ్లాసుడు తాగితే చాలు!

ఫైబర్, విటమిన్లు, ఖనిజాలతో నిండిన దానిమ్మ పండు శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నందున్న శరీర కణాలను రక్షించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఇది దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో, టైప్-2 మధుమేహం వంటి వ్యాధులను నివారించడంలో కూడా ప్రభావవంతంగా పనిచేస్తుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు వ్యతిరేకంగా ప్రతిఘటించే సామర్థ్యం దానిమ్మపండులోని కొన్ని భాగాల్లో ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దానిమ్మపండులో పాలీఫెనోలిక్ అనే ప్రయోజనకరమైన సమ్మేళనం ఉంటుంది. ఈ పండు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. దానిమ్మ రసం తాగితే ఛాతీ నొప్పి తీవ్రత తగ్గుతుందని నిపుణులు అంటున్నారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా దానిమ్మ రసం నివారిస్తుంది. అందుకే ఈ జ్యూస్‌ని రెగ్యులర్‌గా తాగితే కిడ్నీలు బాగుంటాయని నిపుణులు సూచిస్తుంటారు. దానిమ్మ రసం నోటి దుర్వాసనను తగ్గిస్తుంది. నోటిలోని బ్యాక్టీరియాను తగ్గించడం ద్వారా దంత క్షయాన్ని నివారిస్తుంది. క్రమం తప్పకుండా దానిమ్మ రసాన్ని తింటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. దానితో పాటు ప్రేగులలో ఉండే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా సంఖ్య కూడా పెరుగుతుంది. ఫలితంగా గ్యాస్-గుండె మంట సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. దానిమ్మలో ఉండే ఎల్లాగిటానిన్ అనే యాంటీఆక్సిడెంట్ అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధులను నివారించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తుంది.



# ఇలాంటి ఛాతీ నొప్పిని నమ్మితే డేంజర్..!

## అది ప్రాణాంతక గుండె జబ్బులకు సంకేతం కావొచ్చు..!



హార్ట్ ఎటాక్, గుండెపోటు ప్రస్తుతం ఇలాంటి ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ రోజుల్లో చాలా మంది గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. కానీ, మన శరీరంలో ఈ గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన కొన్ని సంకేతాలు ముందుగానే కనిపిస్తాయని, వాటిని మనం పెద్దగా పట్టించుకోకపోవటం వల్లే గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాలు, మరణాలు సంభవిస్తున్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. కానీ, గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాలకు ముందు కనిపించే లక్షణాలు, సంకేతాలలో ఛాతీ నొప్పి ఒకటి. అయితే, మనలో చాలా మందికి ఛాతీ నొప్పి అనిపిస్తుంది.. కానీ, కొన్ని రకాల చాతీ నొప్పి ప్రమాదం అంటున్నారు నిపుణులు. ఇలాంటి చాతి నొప్పి కొన్నిసార్లు అకస్మాత్తుగా చాలా తీవ్రంగా మారుతుంది. ఆ తర్వాత తగ్గిపోతుంది. అలాగే, కొన్నిసార్లు ఇది తక్కువ వ్యవధిలో జరుగుతుంది. తేలికపాటిగా వచ్చిపోతుంది.. నొప్పితో పాటు, కొందరికీ ఛాతీలో మంటగా అనిపిస్తుంది. అయితే, కొన్ని రకాల ఛాతీ నొప్పి గుండె జబ్బులకు సంకేతం కావచ్చు.. దానిని విస్మరిస్తే అది ప్రాణాలకే ప్రమాదం అవుతుంది. ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధుల కేసులు వేగంగా పెరుగుతున్నాయి. గుండె జబ్బుల విషయంలో శరీరంలో కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. ఈ సంకేతాలను గుర్తించడం ద్వారా సమయానికి మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు.. అందులో భరించలేనంతగా వచ్చే ఛాతీ నొప్పి చిన్నదే. దీంతో పెద్దగా ముప్పు ఏమీ ఉండదు. కానీ కొన్ని సందర్భాల్లో నొప్పి మెడ, దవడకు, తరువాత వెనుకకు లేదా కిందకి, ఒకటి లేదా రెండు చేతులకు వ్యాపిస్తుంది. మీరు ఈ రకమైన నొప్పిని అనుభవిస్తున్నట్లయితే, దానిని అస్సలు విస్మరించకూడదని వైద్య ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఈ నొప్పి గుండె సంబంధిత సమస్యలకు ప్రత్యక్ష కారణం కావచ్చునని చెబుతున్నారు. వీటిని నిర్లక్ష్యం చేయడం వల్ల గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. అటువంటి పరిస్థితిలో, వివిధ రకాల ఛాతీ నొప్పి, దానితో సంబంధం ఉన్న వ్యాధుల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. గుండె సంబంధిత ఛాతీ నొప్పి.. నిపుణుల ప్రకారం.. ఛాతీ నొప్పి సాధారణంగా గుండె జబ్బులతో ముడిపడి ఉంటుంది. అయితే గుండె జబ్బులు ఉన్న చాలా మంది వ్యక్తులు తేలికపాటి అసౌకర్యాన్ని అనుభవిస్తుంటారు. వారు వాస్తవానికి నొప్పిని వర్ణించలేరు. అటువంటి పరిస్థితిలో గుండెపోటు లేదా ఏదైనా ఇతర గుండె సమస్య కారణంగా ఛాతీ అసౌకర్యానికి గురవుతుంటారు. ఈ క్రింది లక్షణాలు ఉంటే విస్మరించకండి.. వికారం లేదా వాంతులు చల్లని చెమట శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. గుండె వేగంగా కొట్టుకుంటుంది మైకము లేదా బలహీనత ఛాతీలో ఒత్తిడి, భారం, దహనం లేదా బిగుతు వెన్ను, మెడ, దవడ, భుజాలు, ఒకటి లేదా రెండు చేతులను నలిపివేస్తున్నట్టుగా, కత్తితో పొడిచేస్తున్నట్టుగా నొప్పి నొప్పి కొన్ని నిమిషాల కంటే ఎక్కువ ఉంటుంది. చర్యతో మరింత తీవ్రమవుతుంది, కొంతకాలం తర్వాత వెళ్లి తిరిగి వస్తుంది. ఇతర రకాల ఛాతీ నొప్పి.. ఛాతీలో నొప్పి గుండెకు సంబంధించినదా లేక మరేదైనా కారణమా అని చెప్పడం కష్టం. అటువంటి పరిస్థితిలో మీరు దానిని గుర్తించడం ద్వారా నొప్పిని గుర్తించవచ్చు. సాధారణంగా, మీరు ఈ క్రింది లక్షణాలను అనుభవిస్తే గుండె సమస్య కారణంగా ఛాతీ నొప్పి వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. మింగడానికి ఇబ్బందిగా ఉంటుంది. నొప్పి ఎక్కువ సమయం ఉంటుంది. మీరు మీ శరీర స్థితిని మార్చినప్పుడు తగ్గిపోవటం గానీ, లేదంటే మరింత తీవ్రంగా గానీ, మారుతుంది. పుల్లని రుచి లేదా ఆహారం నోటిలోకి తిరిగి రావడం గుండెల్లో మంట క్లాసిక్ లక్షణాలు రొమ్ము ఎముక వెనుక బాధాకరమైన, మండే అనుభూతి కలుగుతుంది. గుండె లేదా కడుపు సమస్యల వల్ల సంభవించవచ్చు.

# మాంసాహారం ఎక్కువగా తినేవారిలో ఈ క్యాన్సర్ ముప్పు ఎక్కువ!

మాంసం తినేవారికి కొలొరెక్టల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసే ఒక ముఖ్యమైన సవాలు, వైద్య పరిశోధకులు ఆందోళన చెందుతున్నారు. పెద్దప్రేగు క్యాన్సర్ జీర్ణవ్యవస్థలోని ప్రధాన అవయవాలను ప్రభావితం చేస్తుంది. ఇది పోషకాలను గ్రహించడంలో, కడుపు నుండి వ్యర్థాలను తొలగించడంలో జోక్యం చేసుకుంటుంది. కొన్ని ప్రమాద కారకాలు ఈ క్యాన్సర్‌తో సంబంధం కలిగి ఉంటాయి. మాంసాహారం ఎక్కువగా తినడం వల్ల పెద్దపేగు క్యాన్సర్ కూడా వస్తుంది. తగినంత వ్యాయామం చేయకపోవడం, స్థూలకాయంగా ఉండటం, ఆల్కహాల్ లేదా పొగాకు తాగడం, పండ్లు, కూరగాయలు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం, ఫైబర్, కొవ్వు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం వంటివి పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ముఖ్యంగా రెడ్ మీట్ లేదా ప్రాసెస్ చేసిన మాంసాన్ని దీర్ఘకాలికంగా తీసుకోవడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. మాంసాలను అధిక ఉష్ణోగ్రతల వద్ద వండినప్పుడు, అవి క్యాన్సర్ కారక రసాయనాలను ఉత్పత్తి చేస్తాయి. సమతుల్య ఆహారం, వ్యాయామం, ఆరోగ్యకరమైన శరీర బరువును నిర్వహించడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా పెద్దప్రేగు క్యాన్సర్‌ను నివారించవచ్చు. పెద్దప్రేగు క్యాన్సర్ లక్షణాలు: మలబద్ధకం, విరేచనాలు, మలంలో రక్తం, మలవిసర్జన సమయంలో కడుపునొప్పి, రక్తహీనత, అలసట, బరువు తగ్గడం వంటివి పట్టించుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెద్దప్రేగు క్యాన్సర్ లక్షణాలను అర్థం చేసుకోవడం ద్వారా, వ్యాధిని ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చు.




# పుచ్చగింజల్ని వృద్ధాగా పారేస్తున్నారా? ఈ విషయం తెలిస్తే భద్రంగా దాచేస్తారు..

వేసవిలో పుచ్చకాయలు పుష్కలంగా అందుబాటులో ఉంటాయి. రుచితోపాటు వేసవి తాపాన్ని నివారించడంలో పుచ్చకాయలు ఉపయోగపడతాయి. అయితే పుచ్చ కాయ విత్తనాలు వృద్ధాగా పారేస్తున్నారా? ఇకపై అలా చేయకండి. ఎందుకంటే పుచ్చకాయ మాదిరిగానే దాని గింజల్లో కూడా ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. పుచ్చకాయ గింజలను బయటకు తీసి నీటితో బాగా శుభ్రం చేయాలి. తర్వాత వీటిని పొట్టు తీసి ఎండలో బాగా ఆరబెట్టాలి. ఒలిచిన పుచ్చకాయ గింజలు కూడా మార్కెట్‌లో దొరుకుతాయి. జర్నల్ ఆఫ్ ఫార్మాకోగ్నోసి అండ్ ఫైటోకెమిస్ట్రీలో ప్రచురించబడిన పరిశోధన ప్రకారం.. పుచ్చకాయ విత్తనాలను (క్షయవ్యాధి) చికిత్సలో ఉపయోగిస్తారు. ఊపిరితిత్తులలో బ్యాక్టీరియా చేరడం వల్ల దగ్గు సంభవిస్తుంది. మీకు కూడా దగ్గు ఉంటే ఈ గింజలు తీసుకోవచ్చు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా పుచ్చ విత్తనాలు ఎంతో మేలు చేస్తాయి. పుచ్చకాయ గింజలు మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచడంలోనూ సహాయపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కిడ్నీలలో ఏర్పడే రాళ్లను నియంత్రిస్తుంది. మూత్రపిండాలపై ఒత్తిడిని నివారిస్తుంది. పుచ్చకాయ గింజల్లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది నరాల, కండరాల సంకోచంలో సహాయపడుతుంది. ఈ పండు గింజలు గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి కూడా సహాయపడతాయి.

# తక్కువ క్రెడిట్ స్కోర్‌తో బోలెడు సమస్యలు..

## ఈ టిప్స్ పాటిస్తే సమస్యలు ఫసక్..!




భారతదేశంలో ఇటీవల కాలంలో పెరిగిన టెక్నాలజీ కారణంగా బ్యాంకింగ్ రంగంలో కీలక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా లోన్ ఇవ్వడానికి బ్యాంకులు కస్టమర్ చెల్లింపు పరిస్థితిని తెలుసుకోవడానికి వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. పెరిగిన ఖర్చులు, అవసరాల నేపథ్యంలో లోన్ తీసుకోవడం అనేది ప్రస్తుత రోజుల్లో సర్వసాధారణమైంది. అయితే లోన్ తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లినప్పుడు లోన్ ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా బ్యాంకులు లోన్ ఇవ్వడానికి కస్టమర్ క్రెడిట్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకుంటున్నాయి. అయితే క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటే చాలా సింపుల్‌గా రుణాన్ని రిజెక్ట్ చేస్తూ ఉంటాయి. కస్టమర్లు చేసే కొన్ని తప్పుల కారణంగా తక్కువ సిబిల్ స్కోర్ ఉంటుందని చాలా మందికి తెలియదు. ఈ నేపథ్యంలో లోన్ రిజెక్ట్ కాకుండా ఉండడానికి మెరుగైన క్రెడిట్ స్కోర్ ఎలా మెయింటెన్ చేయాలో? ఓసారి తెలుసుకుందాం. బిల్లుల చెల్లింపు మంచి క్రెడిట్ స్కోర్ మెయింటేన్ చేయాలంటే మీ క్రెడిట్ కార్డ్ బిల్లులు, లోన్ ఈఎంఐలు, ఇతర బకాయిలను సకాలంలో చెల్లించాలని నిపుణులు చెబుతున్నారు. చెల్లింపులు ఆలస్యంగా చేయడం వల్ల క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని వివరిస్తున్నారు. క్రెడిట్ కార్డుల వినియోగం కస్టమర్లు వారి వద్ద ఉన్న క్రెడిట్ కార్డుల్లో వినియోగ పరిమితిని 30 శాతం కంటే తక్కువ ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. అధిక క్రెడిట్ వినియోగం ఆర్థిక ఇబ్బందులను సూచిస్తుందని తద్వారా క్రెడిట్ స్కోర్‌ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. రుణాల మిశ్రమం సాధారణంగా మన అవసరానికి సంబంధించి తీసుకున్న రుణాలు మన క్రెడిట్ స్కోర్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. సెక్యూర్డ్ రుణాలు అంటే గృహ రుణాలు వంటివి, అలాగే అసురక్షిత క్రెడిట్ అంటే క్రెడిట్ కార్డ్‌ల వంటివి ఉపయోగించే సమయంలో జాగ్రత్త వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా క్రెడిట్ కార్డుల తీసుకునే సమయంలో మనకు అవసరమైన క్రెడిట్‌ను మాత్రమే తీసుకోవాలని పేర్కొంటున్నారు. లోన్ అప్లికేషన్ల వినియోగం మీరు లోన్ లేదా క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసిన ప్రతిసారీ రుణదాత మీ క్రెడిట్ స్కోర్‌ను తనిఖీ చేస్తాడు. ఫలితంగా మీ రుణ అవసరాన్ని బేరీజు వేసుకుని మీ క్రెడిట్ స్కోర్ తగ్గే ప్రమాదం ఉంది. అందువల్ల లోన్ తీసుకోవాలని అనుకున్నప్పుడు 15 రోజుల వ్యవధిలోనే మీకు అవసరమైన బ్యాంకులకు వెళ్లి రుణ వడ్డీ రేట్లను కనుగొనడం ఉత్తమం. ఇలా చేయడం ద్వారా క్రెడిట్ స్కోర్ తగ్గదని నిపుణులు పేర్కొంటున్నారు. క్రెడిట్ నివేదిక లోపాలు లేదా అనధికారిక లావాదేవీలు లేవని నిర్ధారించుకోవడానికి మీ క్రెడిట్ నివేదికను కాలానుగుణంగా సమీక్షించడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మీరు ఏవైనా వ్యత్యాసాలను కనుగొంటే వాటిని సరిదిద్దడానికి వెంటనే సంబంధిత ఏజెన్సీకు నివేదించాలని సూచిస్తున్నారు.

# ప్రయాణికులకు శుభవార్త! ఈ అన్ని రైల్వే స్టేషన్లలో టికెట్ల కోసం డిజిటల్ చెల్లింపు సదుపాయం




రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ఇప్పుడు రైల్వే స్టేషన్లలో రైలు టిక్కెట్లు కొనుగోలు చేసేటప్పుడు ప్రయాణీకులు కోడ్ ద్వారా డిజిటల్‌గా ఛార్జీలను చెల్లించవచ్చు. పశ్చిమ రైల్వేలు గుజరాత్‌లోని రాజ్‌కోట్, భావ్‌నగర్ డివిజన్‌లలోని అన్ని స్టేషన్లలో కోడ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక త్వరలో అన్ని స్టేషన్‌లలో ఈ విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కొత్త కార్యక్రమం కింద రాజ్‌కోట్ డివిజన్‌లోని రాజ్‌కోట్, జామ్‌నగర్, సురేంద్రనగర్, ద్వారక సహా అన్ని చిన్న, పెద్ద స్టేషన్‌లలోని అన్ని రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ టికెట్ కౌంటర్లలో క్యూఆర్ కోడ్ ద్వారా రైల్వే టిక్కెట్‌ల చెల్లింపును అంగీకరించే సౌకర్యం కల్పించామని డివిజనల్ రైల్వే ప్రతినిధి తెలిపారు. డివిజనల్ రైల్వే మేనేజర్ అశ్వనీ కుమార్, భావ్‌నగర్ డివిజనల్ రైల్వే మేనేజర్ రవీష్ కుమార్ లు క్యూఆర్ కోడ్‌ని ఉపయోగించి టికెట్ ఛార్జీలను డిజిటల్‌గా చెల్లించాలని ప్రయాణీకులను అభ్యర్థించారు. భావ్‌నగర్ డివిజన్‌లోని భావ్‌నగర్ టెర్మినస్, బోటాడ్, గాంధీగ్రామ్, జునాగఢ్, పోర్ బందర్, వెరావల్‌తో సహా అన్ని చిన్న, పెద్ద స్టేషన్‌లలోని అన్ని రిజర్వ్ చేయబడిన, రిజర్వ్ చేయని టికెట్ కౌంటర్లలో కోడ్ ద్వారా రైల్వే టిక్కెట్‌ల చెల్లింపును అంగీకరించే సౌకర్యం అందించారు. రాజ్‌కోట్, భావ్‌నగర్ డివిజన్ డిజిటల్ చెల్లింపు పద్ధతులను ఉపయోగించి నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి, ప్రయాణీకులకు సాఫీగా, మరింత సమర్థవంతమైన సేవలను అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. డివిజన్‌లోని రిజర్వేషన్ కార్యాలయం, బుకింగ్ కార్యాలయం అన్ని కౌంటర్లలో కోడ్ పరికరాలు అమర్చారు. రైల్వే ప్రయాణికులు టిక్కెట్ ఛార్జీలు చెల్లించేందుకు క్యూఆర్ కోడ్ డిజిటల్ మాధ్యమం సౌకర్యం కల్పిస్తున్నారు. ౦ల్వే ప్రయాణికులు ఇప్పటికే యూటీఎస్ మొబైల్ యాప్, వంటి వివిధ డిజిటల్ చెల్లింపు ఎంపికలను టిక్కెట్ ఛార్జీని చెల్లించడానికి అందుబాటులో ఉన్నాయి. ఈ రకమైన డిజిటల్ చెల్లింపు వ్యవస్థను మరింత ఉపయోగకరంగా, సాఫీగా మార్చే లక్ష్యంతో, రాజ్‌కోట్ డివిజన్ దీనిని విస్తరించింది. ఈ కొత్త డిజిటల్ చెల్లింపు విధానం ఇప్పుడు క్యూఆర్ కోడ్ ద్వారా టిక్కెట్ ఛార్జీలు చెల్లించడానికి ప్రయాణీకులకు మరింత సౌలభ్యాన్ని అందిస్తుంది. దీని ద్వారా ఏ ప్రయాణీకుడైనా తన టికెట్ ఛార్జీలను సజావుగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లించవచ్చు.

# అద్దె ఒప్పందం 11 నెలలకే ఎందుకు చేసుకుంటారో తెలుసా.?



ఇంటి కోసం లేదా దుకాణం కోసం అద్దెకు తీసుకోవడం సర్వసాధారణమైన విషయం. దేశంలో చాలా సొంతింటిలో ఉంటున్న వారి కంటే, సొంత దుకాణాల్లో వ్యాపారాలు చేస్తున్న వారి కంటే అద్దె ఇంట్లో ఉంటున్న వారే ఎక్కువని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే అద్దెకు తీసుకునే సమయంలో రెంటల్ అగ్రిమెంట్ చేసుకుంటారని మనకు తెలిసిందే. అద్దెకు ఇచ్చే వారికి, అద్దె తీసుకునే వారి మధ్య ఈ ఒప్పందం జరుగుతుంటుంది. రెంటల్ అగ్రిమెంట్‌లో యజమాని పేరు, చిరునామా, అద్దె మొత్తం ఎంత.? ఎంత వ్యవధి కోసం అద్దె తీసుకుంటున్నారు, ఇంకా ఏమైనా ఇతర నిబంధనలు లేదా షరతులు ఉంటే వాటిని అందులో పేర్కొంటారు. అద్దె ఒప్పందం అనేది ఒక రకమై లీజు ఒప్పందం లాంటిది. వీటిని వైట్ పేపర్స్‌పై లేదా, బాండ్ పేపర్‌పై రాసి సాక్ష్యుల సమక్షంలో ఒప్పందాలు చేసుకుంటారు. అయితే చాలా వరకు రెంటల్ అగ్రిమెంట్స్ 11 నెలల వ్యవధికి మాత్రమే చేసుకుంటారు. అయితే 11 నెలలకే రెంటల్ అగ్రిమెంట్ ఎందుకు చేసుకుంటారన్న దానిపై ఎప్పుడైనా సందేహం వచ్చిందా.? దీని వెనకాల అసలు కారణం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. 11 నెలలకు రెంటల్ అగ్రిమెంట్ చేసుకోవడానికి కారణాల్లో రిజిస్ట్రేషన్ చట్టం 108 ఒకటి. రిజిస్ట్రేషన్ చట్టం 1908లో సెక్షన్ 17 నిబంధనల ప్రకారం ఏడాది కంటే తక్కువ లీజు ఒప్పందం చేసుకోవడం కుదరదు. ఏడాదికి లీజు ఒప్పందం చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా కాస్త వ్యయప్రయాసలతో కూడుకున్న అంశం కావడంతో చాలా మంది కేవలం 11 నెలలకే రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. తిరిగి 11వ తనెల పూర్తి కాగానే మళ్లీ, మరో 11 నెలలకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ఇదండీ 11 నెలల రెంటల్ అగ్రిమెంట్ వెనకాల ఉన్న అసలు ఉద్దేశం.

# 21 ఏళ్లలో రూ. 70 లక్షలు.. నెలకు ఎంత సేవ్ చేయాలంటే..



సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సేవ్ చేసుకోవాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. అయితే ఇది వారి వారి ఆదాయాలకు అనుగుణంగా మారుతుంటుంది. సంపాదించే ప్రతీ ఒక్కరూ సేవింగ్స్ చేయాలని ఆర్థిక నిపుణులు సైతం చెబుతుంటారు. ఒకప్పుడు కర్చు పెట్టిన తర్వాత మిగిలిన మొత్తాన్ని సేవ్ చేసే వారు. కానీ ప్రస్తుతం పొదుపు చేసిన తర్వాత మిగిలిన మొత్తాన్నే ఖర్చు చేస్తున్నారు. ఇక పెట్టుబడి పెట్టేందుకు ఎన్నో రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయి. కష్టపడి సంపాదించిన సొమ్ముకు భద్రతతో పాటు, మంచి రిటర్న్స్ రావాలని ప్రతీ ఒక్కరూ ఆశిస్తుంటారు. అలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వ సంస్థ పోస్టాఫీస్ పలు రకాల పథకాలను అందిస్తోంది. ఇలాంటి బెస్ట్ స్కీమ్స్‌లో సుకన్య సమృద్ధి యోజన ఒకటి. బాలికల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో రూ. 250 నుంచి గరిష్టంగా ఏడాదికి రూ. 1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు. ఈ పథకంలో మొత్తం 15 ఏళ్లు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. 21 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ లభిస్తుంది. మరి ఈ పథకంలో భాగంగా రూ. 70 లక్షలు పొందాలంటే నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. మీ కూతురు పుట్టిన రోజు నుంచే సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ప్రారంభించి ఏటా రూ. 1.5 లక్ష డిపాజిట్ చేశారనుకుందాం. ఈ లెక్కన మీరు ప్రతీ నెల రూ. 12,500 సేవ్ చేయాల్సి ఉంటుంది. ఇలా 15 ఏళ్లు పెట్టుబడి పెడితే మొత్తం రూ. 22,50,000 అవుతుంది. ప్రస్తుతం ఈ పథకానికి 8.2 శాతం వడ్డీ లభిస్తోంది. 21 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ సమయంలో ర. 46,77,578 వడ్డీగా పొందుతారు. దీంతో మీ కూతురు 21 ఏళ్ల నాటికి అసలు, వడ్డీతో కలిపి మొత్తం రూ. 69,27,578 అంటే సుమారు రూ.70 లక్షలు పొందొచ్చు.ఉదాహరణకు మీరు ఒకవేళ 2024 సెప్టెంబర్‌లో ఈ పథకంలో చేరితే మీకు 2045 నాటికి రూ.7 లక్షలు పొందొచన్నమాట.ఇక ఈ పథకంలో పెట్టుబడిఎట్టినవారికి1961లోనిసెక్షన్80%కిందపన్నుఆదాఅవకాశం కూడా లభిస్తుంది.

# వ్యాపారం



## దృష్టి లోపం ఉన్న వారికి కూడా మేలైన బ్యాంకింగ్ సేవలు..

### బ్రెయిలీ డెబిట్ కార్డు లాంచ్ ద్వారా ఆ సమస్యలు దూరం




భారతదేశంలో ఇటీవల కాలంలో బ్యాంకింగ్ సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని బ్యాంకు ఖాతాల ద్వారానే లబ్ధిదారులకు అందిస్తున్నాయి. ముఖ్యంగా జన్-ధన్-ఖాతాలు భారతదేశంలో బ్యాంకింగ్ విప్లవాన్నే సృష్టించాయని చెప్పాలి. భారతదేశ పౌరులందరికీ జీరో బ్యాలెన్స్ అకౌంట్ల ద్వారా బ్యాంకింగ్ సేవలను అన్ని బ్యాంకులు అందించాయి. ముఖ్యంగా డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు కూడా పెరిగాయి. డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి బ్యాంకులకు వెళ్లే అవసరం లేకుండా డెబిట్ కార్డులను ఉపయోగించి ఏటీఎంల ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునే వారు ఇటీవల కాలంలో బాగా పెరిగారు. అయితే దృష్టి లోపం ఉన్న వారు బ్యాంకింగ్ సేవలను పొందడంలో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా వారికంటూ ప్రత్యేక చర్యలు ఏవీ లేకపోవడంతో వారు ఇంకా నగదు డిపాజిట్, విత్‌డ్రా కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో దృష్టి లోపం ఉన్న వారికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ గుడ్‌న్యూస్ చెప్పింది. బ్రెయిలీ డెబిట్ కార్డులను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ తీసుకున్న చర్యలు గురించి వివరాలను తెలుసుకుందాం. ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం పీఎన్‌బీ అంత: దృష్టి పేరులో బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రారంభించింది.ఈ కాంటాక్ట్‌లెస్ నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ) డెబిట్ కార్డ్ రూపే నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉందని పీఎన్‌బీ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రవేశపెట్టడం అనేది చేరిక, ఆర్థిక సౌలభ్యంపై పీఎన్‌బీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆ బ్యాంకు ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించేందుకు పీఎన్‌బీ ఇలాంటి చర్యలను తీసుకుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇతర బ్యాంకులతో పోలిస్తే పీఎన్‌బీ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం ప్రత్యేక చర్యలను తీసుకోవడం అభినందనీయమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దేశంలోని అందరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయని వివరిస్తున్నారు.

## యూపీఐ నగదు చెల్లింపుల్లో ఆ తప్పు చేశారా..? ఈ టిప్స్ పాటిస్తే మీ సొమ్ము వాపస్



భారతదేశంలో 2016లో నోట్లను రద్దు చేశాక ఆన్‌లైన్ చెల్లింపులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఎన్‌పీసీఐ అందుబాటులోకి తీసుకువచ్చిన యూపీఐ పేమెంట్స్ సదుపాయం ద్వారా చాలా మంది నగదును ఈజీగా బదిలీ చేస్తున్నారు. ముఖ్యంగా యూపీఐ చెల్లింపుల వల్ల దేశంలో చిల్లర సమస్యకు చెక్ పడినట్లు అయ్యింది. అలాగే వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లకు నగదు బదిలీ కూడా బ్యాంకునకు వెళ్లాల్సిన అవసరం లేకుండా యూపీఐ చెల్లింపులు ద్వారా చేయడం ప్రజలకు అలవాటు అయ్యింది. అయితే యూపీఐ ద్వారా ఒక వ్యక్తికి పంపబోయి వేరే వ్యక్తికి నగదును బదిలీ చేస్తే అవి తిరిగి రావు అని చాలా మంది చెబుతూ ఉంటారు. కానీ, నిర్దిష్ట విధానాన్ని పాటించడం ద్వారా మనం పొరపాటున వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును వాపస్ పొందవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును ఎలా వాపసు పొందవచ్చో? ఓసారి తెలుసుకుందాం. యూపీఐ ద్వారా బదిలీ చేసిన నగదు వాపసు పొందడం ఇలా మీరు ముందుగా ఏ యాప్ ద్వారా నగదు బదిలీ చేశారో? ఆ యాప్‌లో లావాదేవీ నెంబర్ ద్వారా టిక్కెట్ రైజ్ చేసి కంప్లైంట్ చేయాలి. అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌ను సందర్శించి, 'వివాద పరిష్కార యంత్రాంగం' విభాగాన్ని సెలెక్ట్ చేసి ఆన్‌లైన్ ఫారమ్‌ను పూరించాలి. లావాదేవీ ఐడీ, వర్చువల్ చెల్లింపు చిరునామా, బదిలీ చేసిన మొత్తం, లావాదేవీ తేదీ, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో సహా అవసరమైన వివరాలను అందించాలి. అనంతరం అకౌంట్‌లో సొమ్ము బదిలీ జరిగినట్లు మీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను అప్‌లోడ్ చేయాలి. అక్కడ మీ ఫిర్యాదుకు కారణం 'మరో ఖాతాకు తప్పుగా బదిలీ చేయబడింది' ఎంచుకోవాలి. అనంతరం మీ ఫిర్యాదు పరిష్కారమవుతుంది. ఒకవేళ సమస్య పరిష్కరించకపోతే ముందుగా టీపీఏపీ, తర్వాత పీఎస్‌పీ బ్యాంక్ (చెల్లింపు సర్వీస్ ప్రొవైడర్ బ్యాంక్), అనంతరం బ్యాంకును సమస్య పరిష్కారం కోసం సంప్రదించాలి. ఒక నెల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకపోతే లేదా ప్రతిస్పందనతో మీరు అసంతృప్తి చెందితే, డిజిటల్ లావాదేవీల కోసం ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ని సంప్రదించాలి.

## ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితి పెంపు.. ఆ బ్యాంకుల్లో ప్రత్యేక ఆఫర్లు

భారతదేశంలో పెట్టుబడిదారులు నమ్మకమైన పెట్టుబడి ఎంపికగా ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎంచుకుంటూ ఉంటారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ రంగంలో వచ్చిన మార్పుల వల్ల ఎఫ్‌డీల కంటే మంచి పెట్టుబడి ఎంపికలు ప్రజాదరణ పొందుతున్నాయి. క్రమేపి బ్యాంకుల్లో ఎఫ్‌డీల్లో డిపాజిట్ చేసే వారి సంఖ్య క్రమేపి తగ్గుతుంది. ఈ నేపథ్యంలో కస్టమర్లను ఎఫ్‌డీల్లో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించడానికి చాలా బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లను లాంచ్ చేస్తున్నాయి. సాధారణ ఎఫ్‌డీలతో పోలిస్తే ఈ ప్రత్యేక ఎఫ్‌డీలు అధిక వడ్డీను అందిస్తున్నాయి. తాజాగా ప్రముఖ బ్యాంకులు అన్నీ ప్రత్యేక ఎఫ్‌డీల కాలపరిమితిని పెంచాయి. ఈ నేపథ్యంలో ఏయే బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని పెంచాయో? ఓ సారి తెలుసుకుందాం. పొడగింపులను ప్రకటించిన బ్యాంకులు ఇవే ఇండియన్ బ్యాంక్ తన ప్రత్యేక ఎఫ్‌డీల కోసం పొడిగింపును ప్రకటించింది. ఎఫ్‌డీ పెట్టుబడిదారులు సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఈ గడవు జూన్ 30తో ముగిసినా మరోసారి పెంచారు. ఐడీబీఐ బ్యాంక్‌కు సంబంధించిన ప్రత్యేక ఉత్సవ్ ఎఫ్‌డీల గడువు కూడా సెప్టెంబర్ 30, 2024 వరకు పొడిగించారు. వాస్తవానికి ఈ పథకం గడువు జూన్ 30, 2024న ముగిసినా వినియోగదారులను ఆకర్షించడానికి బ్యాంకు మరోసారి గడువును పొడగించింది. పంజాబ్ సింధ్ బ్యాంక్ లిమిటెడ్ పిరియడ్ ప్రత్యేక డిపాజిట్ల కాలపరిమితిని పెంచింది. ఈ గడువు సెప్టెంబర్ 30, 2024కి ముగుస్తుంది. ప్రముఖ బ్యాంకు ఎస్‌బీఐ కూడా ప్రత్యేక డిపాజిట్లపై కాలపరిమితిని పెంచింది. అమృత్ కలాష్ స్కీమ్, ఎస్‌బీఐ వీ కేర్ ఎఫ్‌డీల కాలపరిమితిని ఎస్‌బీఐ పెంచింది. ఎస్‌బీఐ కూడా ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని సెప్టెంబరు 30, 2024 వరకు పెంచింది.

# వారానికో బాతు గుడ్డు తినండి..!
## ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదులుకోరు



బాతు గుడ్లు వివిధ ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. కోడి గుడ్లకు రుచికరమైన, పోషకమైన ప్రత్యామ్నాయం బాతుగుడ్లు. వాటిలో ప్రోటీన్, విటమిన్లు, విటమిన్ బి12, విటమిన్ డి, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అదనంగా బాతు గుడ్లు, కోడి గుడ్ల కంటే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల సాంద్రతను కలిగి ఉంటాయి. ఇవి గుండె, మెదడుకు మేలు చేస్తాయి. బాతు గుడ్లు కొంతమందికి సులభంగా జీర్ణమవుతాయి. మీ ఆహారంలో బాతు గుడ్లను చేర్చుకోవడం వల్ల మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. వారానికి ఒకసారి బాతు గుడ్లు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఇక్కడ తెలుసుకుందాం.. కోడి గుడ్ల కంటే రెట్టింపు ప్రయోజనం బాతు గుడ్లు వల్ల కలుగుతుంది. బాతు గుడ్లలో ప్రొటీన్లు, విటమిన్లు, విటమిన్ బి12, విటమిన్ డి, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అంతే కాదు ఇందులో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా చాలా ఎక్కువ. మన గుండె, మెదడు, జ్ఞాపకశక్తికి ఈ ప్రయోజనాలన్నీ చాలా మంచివి. బాతు గుడ్లు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయి. ఇది బరువు నిర్వహణ, కండరాల పెరుగుదల, వ్యాయామం తర్వాత కోలుకోవడానికి సహాయపడుతుంది. బాతు గుడ్లు చాలా తేలికగా జీర్ణమవుతాయి. కోడి గుడ్ల కంటే బాతు గుడ్లు చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయని, పరిమాణం పరంగా మరింత మెరుగ్గా ఉంటాయి. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు. వారానికి ఒకసారి బాతు గుడ్డు మీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. యాంటీఆక్సిడెంట్ లక్షణాలు.. బాతు గుడ్లలో యాంటీఆక్సిడెంట్ చర్యలో గణనీయమైన పెరుగుదల గమనించబడింది. బాతు గుడ్లలో ఉండే కెరోటినాయిడ్స్, అమినో యాసిడ్స్ యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. క్యాన్సర్ నివారణకు బాతు గుడ్లను ముఖ్యమైన ఆహారంగా తీసుకోవచ్చు. కోడి గుడ్ల కంటే డీసాల్టెడ్ బాతు గుడ్డులోని తెల్లసొన మంచి కాల్షియం శోషణను కలిగి ఉంటుంది. బరువు నియంత్రణతో పాటు, బాతు గుడ్లు కండరాల ఆరోగ్యానికి, బలానికి సహాయపడతాయి. వ్యాయామం తర్వాత వారానికి ఒకసారి బాతు గుడ్లు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. బాతు గుడ్లు కండరాల బలాన్ని పెంచుతుంది. కండరాల నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.



## ఎండు ద్రాక్ష నీరు ఇలా తాగారంటే.. కేవలం 10 రోజుల్లోనే ఆ సమస్యలన్నీ పరార్..!



ప్రస్తుత కాలంలో ఎంతో మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో అధిక బరువు కూడా ఒకటి. అధిక బరువు కారణంగా చాలా మంది అనేక అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యాయామం, వాకింగ్, హెల్దీ డైట్, జిమ్ ఇలా చాలానే ట్రై చేస్తున్నారు. అయితే కొన్ని రకాల సింపుల్ చిట్కాలతో కూడా వెయిట్ లాస్ అవ్వొచ్చని నిపుణులు చెబుతున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎండు ద్రాక్ష వాటర్ ఎంతగానో సహకరిస్తుంది. ప్రతిరోజూ ఎండు ద్రాక్ష నీరు తాగుతూ, మంచి డైట్ మెయిన్ టైన్ చేస్తూ.. వ్యాయామం చేస్తే మీకు కేవలం 10 రోజుల్లోనే రిజల్ట్ కనిపిస్తుంది. ఇలాంటి వాటర్ తాగడం వల్ల మీ బాడీ కూడా ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటుంది. మరి ఇంకా ఎండు ద్రాక్ష నీటిని తీసుకుంటే ఎలాంటి లాభాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. బాడీని డిటాక్సిఫికేషన్ చేస్తుంది: ఎండుద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరం డీటాక్సిఫై అవుతుంది. రోజు వారీ జీవితంలో మనకు తెలియకుండానే కాలుష్యం, తినే ఆహారం ఇలా రకరకాల కారణాల వల్ల శరీరంలో మలినాలు అనేవి చేరతాయి. కాబట్టి ఎండు ద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరంలో ఉండే మలినాలు బయటకు పోతాయి. శరీరం ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే శక్తి కూడా లభిస్తుంది. నిద్ర లేమి సమస్యలను దూరం చేస్తుంది: బరువు పెరిగేందుకు నిద్ర లేమి సమస్యలు కూడా ఒక కారణంగా ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సరైన నిద్ర లేకపోతే.. తిన్నది అరగక.. పొట్టలో కొవ్వు అనేది నిల్వ ఉండిపోతుంది. అంతే కాకుండా గ్యాస్ అసిడిటీ సమస్యలు కూడా వస్తాయి. కాబట్టి మీరు ఎండు ద్రాక్ష నీటిని తాగితే నిద్ర లేమి సమస్యల్ని దూరం చేస్తుంది. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: ఎండు ద్రాక్ష నీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటివి లభ్యమవుతాయి. ఇవి శరీరంలోని ద్రవాల స్థాయిల్ని కంట్రోల్‌లో ఉంచుతుంది. చెమట వల్ల కోల్పోయిన శక్తి ఈ నీళ్ల వల్ల తిరిగి వస్తుంది. నాడీ వ్యవస్థ పనితీరు, కండరాల తీరును సరి చేస్తుంది. గట్ హెల్త్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల గట్ హెల్త్ కూడా మెరుగు పడుతుంది. శరీరంలో నుంచి మలినాలన్నీ బయటకు పంపుతుంది. ఎండు ద్రాక్షలో ఉండే ఫైబర్ జీర్ణ శక్తిని, మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా చేస్తుంది. వెయిట్ లాస్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల తక్కువ రోజుల్లోనే బరువు తగ్గుతారు. ఎండు ద్రాక్ష నీటిలో ఫైబర్ కంటెంట్ మెండుగా ఉంటుంది. కాబట్టి ఈ నీటిని తీసుకుంటే కడుపు నిండిన భావన కలుగుతుంది. గోరు వెచ్చటి నీటిలో 3 లేదా 4 ఎండు ద్రాక్షను వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం లేవగానే ఆ నీటిని తాగి ఎండుద్రాక్ష తినాలి.

## క్యాన్సర్ భూతాన్ని పారదోలే అద్భుత ఫలం.. ఎక్కడ కనిపించినా వదిలిపెట్టకండీ!

ఆప్రికాట్ పండు చాలా రుచికరమైన పండు. యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఈ పండులో పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా వ్యవహరిస్తుంది. వీటిని రోజు వారీ ఆహారంలో క్రమం తప్పకుండా తింటే ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ఆప్రికాట్ పండును సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. అయితే పోషకాలు మాత్రం పుష్కలంగా ఉంటాయి. ఆప్రికాట్ పండ్లలో బీటా కెరోటిన్, లుటిన్, పొటాషియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, జియాక్సంతిన్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్ పండ్లు కళ్లకు కూడా చాలా మేలు చేస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో బీటా కెరోటిన్, విటమిన్ ఎ, జియాక్సంతిన్ ఉంటాయి. ఈ మూడు పదార్థాలు కళ్లకు ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్‌పండ్లు కంటిశుక్లం, రేచీకటి ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఆప్రికాట్ పండ్లలో వివిధ రకాల ఫైబర్ ఉంటుంది. కాబట్టి ఈ పండు తింటే జీర్ణం సులువుగా కడుపు క్లీన్ చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఈ పండు ఎంతగానో ఉపయోగపడుతుంది. బీటా-కెరోటిన్, లుటిన్, జియాక్సంతిన్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు వంటి పదార్థాలు శరీరంలోని యాంటీ-క్యాన్సర్ ఏజెంట్లుగా పనిచేస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి కణాలను రక్షిస్తాయి. ఆప్రికాట్ పండ్లు శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి. ఆప్రికాట్ పండ్లలో అధికంగా పొటాషియం ఉంటుంది. కాబట్టి ఇది రక్తపోటును పెంచదు. ఆప్రికాట్ కూడా కాలేయం దెబ్బతినకుండా కాపాడుతుంది. ఈ పండు కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆప్రికాట్ పండ్లు శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ తగ్గకుండా కాపాడుతాయి. అంటే మీరు ఎంత కష్టపడి పనిచేసినా శరీరం బలహీనపడకుండా ఉంటుంది.

## తమలపాకును నీళ్లలో మరిగించి తాగితే ఏమవుతుందో తెలుసా..? నమ్మలేని లాభాలు..



ఇందుకోసం ముందుగా పొయ్యి మీద ఒక పాత్ర పెట్టి, ఒక గ్లాసు నీళ్లు పోసి, ఒక తమలపాకును ముక్కలుగా కట్ చేసి అందులో వేయాలి. 5 నుంచి7 నిమిషాలు మరిగించి ఆ నీటిని వడకట్టి తాగాలి. మలబద్దకం సమస్య ఉన్నవారికి ఈ తమలపాకు నీరు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పేగు కదలికలు బాగా జరిగేలా చేస్తుంది. శరీరంలో వాపులను తగ్గిస్తుంది. తమలపాకులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉండటంవల్ల ఛాతీలో పేరుకుపోయిన కఫాన్ని తొలగిస్తుంది. అలాగే జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. మధుమేహం నియంత్రణలో కూడా తమలపాకు నీరు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచటమే కాకుండా, మధుమేహం కారణంగా వచ్చే సమస్యలను కూడా తగ్గిస్తుంది. చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను కూడా తమలపాకు నీరు నియంత్రిస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. తమలపాకులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండుటవల్ల ఆస్తమాను కూడా అదుపులో ఉంచుతుంది. అంతేగాక తమలపాకును మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగిస్తున్నారు. ఇది నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. తమలపాకు నోటిలో బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తుంది. అయితే తమలపాకు నీటిని ఎప్పుపడితే అప్పుడు తాగడం కూడా మంచిదికాదు. రోజులో ఒకసారి మాత్రమే తీసుకోవాలి.

## వయసు పెరిగినా యవ్వనంగా కనిపించాలంటే.. ఈ పండ్లు తినండి! ఏంజెల్స్‌లా మెరిసిపోతారు

ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ యవ్వనంగా, అందంగా కనిపించాలని కోరుకుంటారు. దీని కోసం అనేక రకాల చికిత్సలు కూడా తీసుకుంటూ ఉంటారు. బ్యూటీ పార్లర్లలలో రకరకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులను వినియోగిస్తుంటారు. కానీ ప్రతీసారి ఆశించిన ఫలితాలు అందకపోవచ్చు. నిజానికి, చర్మం యవ్వనంగా కనిపించాలంటే కొన్ని ఆహారాలను డైట్‌లో చేర్చుకోవాలి. అలాగే చెడు జీవనశైలి కారణంగా కూడా చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఏది ఏమైనప్పటికీ, వేసవి కాలంలో సూర్యుని కిరణాల కారణంగా చర్మం దెబ్బతింటుంది. అటువంటి పరిస్థితిలో చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవడం వల్ల అతి చిన్న వయసులోనే వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖంపై, ముడతలు, మచ్చలు కనిపించడం ప్రారంభిస్తాయి. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే ఏయే ఆహారాలు తీసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.. బెర్రీ పండ్లు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు బెర్రీలలో పుష్కలంగా లభిస్తాయి. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, బ్లాక్బెర్రీస్ తినడం వల్ల చర్మం యవ్వనంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలో వేగవంతమైన మార్పులను నెమ్మదించేలా చేస్తాయి. దీనితో పాటు బెర్రీలు ఆక్సీకరణ ఒత్తిడిని తొలగించడంలో కూడా సహాయపడతాయి. డ్రై ఫ్రూట్స్ బాదం, వాల్‌నట్, జీడిపప్పు, వాల్‌నట్, గుమ్మడికాయ గింజలు వంటి డ్రై ఫ్రూట్స్ చర్మానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. చర్మానికి మేలు చేసే డ్రై ఫ్రూట్స్ రోజూ తినడం వల్ల ఇందులో ఉండే విటమిన్-ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా చర్మానికి అందుతాయి. కొవ్వు చేప నాన్ వెజ్ ఫుడ్ ఇష్టపడే వారు చర్మాన్ని కాపాడుకోవడానికి ఫ్యాటీ ఫిష్ ను తమ డైట్ లో చేర్చుకోవచ్చు. చర్మంపై కనిపించే వృద్ధాప్య సంకేతాలను నివారించడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కొవ్వు



చేపలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో సహాయపడతాయి. వీటితోపాటు గ్రీన్ టీ ద్వారా కూడా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల చర్మ కణాలు ఆరోగ్యంగా ఉంటాయి.

## అధిక రక్తపోటు ఎంత ప్రమాదమో తెలుసా? నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదంటున్న నిపుణులు



హైపర్ టెన్షన్ కూడా ఓ విధమైన సైలెంట్ కిల్లర్. అధిక రక్తపోటు ప్రాణాలను నెమ్మదిగా హరిస్తుంది. మీకూ అధిక రక్తపోటు సమస్య ఉంటే ప్రతిరోజూ తప్పకుండా మెడిసిన్ తీసుకోవాలి. అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలు వస్తాయి. అసలు అధిక రక్తపోటు ఎందుకు దాడి చేస్తుంది? ఈ సమస్యను ఎలా నియంత్రించవచ్చు వంటి వివరాలు నిపుణుల మాటల్లో తెలుసుకుందాం. బిర్లా హార్ట్ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సబ్యసాచి పాల్ మాట్లాడుతూ.. రక్తపోటు వెనుక అనేక జీవనశైలి కారకాలను వివరించారు. వీటిలో వ్యాయామం నుంచి ఊబకాయం, ధూమపానం వరకు అనేక కారకాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని డాక్టర్ సబ్యసాచి పాల్ అంటున్నారు. కానీ రోజువారీ ఏరోబిక్ వ్యాయామం రక్తపోటును పెంచుతుంది. ముఖ్యంగా రక్తపోటు అదుపులో లేని వారు, శరీర బరువు పెరిగినవారికి, ఊబకాయంతో బాధపడుతున్నవారికి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. ఊబకాయం కారణంగా అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా తరచుగా సంభవిస్తుంది. ఇది రక్తపోటు ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. ప్రిజర్వేటివ్స్, చక్కెర, ఉప్పుతో కూడిన ప్రాసెస్ చేసిన ఆహారాలు రక్తపోటుకు కారణమని డాక్టర్ సబ్యసాచి పాల్ చెబుతున్నారు. ఇందులో అధిక మొత్తంలో కేలరీలు, సోడియం ఉంటుంది. ఇవి అధిక రక్తపోటుతో పాటు కిడ్నీ సమస్యలు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతాయి. అధిక రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి ఫాస్ట్ ఫుడ్ మానుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని డాక్టర్ పాల్ సూచిస్తున్నారు. జీవనశైలి కారకాలు మాత్రమేకాకుండా, రక్తపోటుకు మరొక కారకం కూడా ఉంది. అధిక రక్తపోటుకు ఒత్తిడి కూడా కారణం. ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. మీరు హైపర్‌టెన్షన్ రోగి అయితే, ప్రతిరోజూ తప్పనిసరిగా మందులు వాడాల్సి ఉంటుంది. బిఎమ్ బిర్లా హార్ట్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ అంజన్ సియోటియా ఈ విషయాన్ని సూచిస్తున్నారు. చాలా మంది హైపర్ టెన్షన్ కు చికిత్స తీసుకోరని డాక్టర్ అంజన్ అంటున్నారు. సగం కంటే ఎక్కువ మందికి తమకు అధిక రక్తపోటు ఉందనే విషయమే తెలియదు. ఎందుకంటే వారు ఎప్పుడూ రక్తపోటును క్రమం తప్పకుండా టెస్ట్ చేయించుకోరు. అలాగే దీనిపై అవగాహన ఉన్న రోగులలో కూడా సగం మంది రోగులు రోజూ మందులు తీసుకోరు. ఈ కారణంగా మరణాల సంఖ్య పెరుగుతుంది. చికిత్స చేయకపోతే సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. దీంతో పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి తరచుగా రక్తపోటు పరీక్షించుకోవాలి. అలాగే మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. ఇలాచేస్తే రక్తపోటును నియంత్రించడం సులభతరం అవుతుంది.

ది క్రైమ్ న్యూస్ తెలుగు దినపత్రిక






## అన్నవరం పరిసరాల్లో పులి సంచారం. అధికారుల అప్రమత్తం

అన్నవరం, మారిచ 15 : కాకినాడ జిల్లాలో కొద్ది రోజులుగా పులి సంచారం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలోనే అన్నవరం పరిసరాల్లోకి పులి వచ్చే అవకాశం ఉందని దేవస్థానం, పోలీసు, అటవీ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. భక్తులు, గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని ప్రచారం చేశారు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గంలో భక్తులు ఒంటరిగా నడిచి వెళ్లవద్దని, ఘాట్ రోడ్డులో ఎక్కడా వాహనాలను నిలవద్దని సూచిస్తున్నారు. వసతి గదుల్లో ఉన్న వారు రాత్రి సమయాల్లో బయటకు రావద్దని, కొండపై భక్తులు అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.






# ఆర్యవైశ్యులంటే సేవలు..మంచితనానికి ప్రతీక

## కైకలూరులో ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రారంభంలో మంత్రి టీజీ భరత్



కైకలూరు, మార్చి 15 : ఏలూరు జిల్లా కైకలూరు పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన ఆర్యవైశ్య కళ్యాణ మండపాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి మంత్రి టీజీ భరత్, స్థానిక ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)లతో కలిసి ఆదివారరి ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం, భవన ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రి రూ. 5 కోట్లతో అద్భుతంగా నిర్మించారని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ..'ఆర్యవైశ్యులు అనగానే సేవా, మంచితనం గుర్తుకు వస్తాయి. అన్ని వసతులతో సర్వాంగ సుందరంగా కళ్యాణ మండపాన్ని నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కారణాలతో భవన నిర్మాణం మూడేళ్ల పాటు నిలిపివేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్నారు. రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులతో గూగుల్ వంటి దిగ్గజ సంస్థలను ఆహ్వానిస్తున్నాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలతో పోలిస్తే, ఏపీలో ఆర్యవైశ్యులకు అత్యున్నత గౌరవం దక్కుతోంది' అని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.కామినేని మాట్లాడుతూ.. క్వాలిటీలో ఎక్కడ రాజీ లేకుండా చాలా సుందరంగా కళ్యాణ మండపాన్ని నిర్మించారాని అభినందించారు. కేవలం దాతల సహకారంతో ఇంత అద్భుతమైన కళ్యాణ మండపాన్ని నిర్మించిన కమిటీ సభ్యులను అభినందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కర్నూల్ జిల్లా టిడిపి అధ్యక్షులు, కర్నూల్ అర్బన్ డెవలప్మెంట్ అధారిటి (KUDA) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్‌రావు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కో ఆర్డినేషన్ కో కన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మి,రాష్ట్ర ప్రభుత్వ ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడిమర్రి మాల్యాద్రి,జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, మండల టిడిపి మాజీ అధ్యక్షులు పెన్మెత్స త్రినాధ్ రాజు,మండల టిడిపి అధ్యక్షులు పి. రాధకృష్ణ,తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,తామరకొల్లు మాజీ యమ్.పి.టి.సి గంగుల శ్రీదేవి,భుజబలపట్నం మాజీ సర్పంచ్ గుజ్జుల రామలక్ష్మి,లక్కింశెట్టి మోహన్, ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సోదరులు ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# రహదారుల అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే డా.కామినేని





కైకలూరు, మార్చి 15 : నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికిపెద్దపీట వేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్,కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు.కైకలూరు ఎన్జీఓల కాలనీలో నరేగా నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే డా.కామినేని ఆదివారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, డ్రెయినేజీ, పారిశుద్ధ్యం వంటి వాటికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, సిసిరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డా.కామినేనిని కాలనీ ప్రముఖులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్‌రావు, ఎంపిపి అడివి కృష్ణ, వైస్ ఎంపిపి మంగినేనిరామకృష్ణ,



డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, సీనియర్ న్యాయవాది టి. శ్రీనివాసరావు, సాహితీ మిత్రులు చింతపల్లి వెంకటనారాయణ, ఎన్డీఏ కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, పుప్పాల సూర్యప్రకాష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎంపి పుట్టా మహేష్ వెంటనే రాజీనామా చేయాలి : డీఎన్నార్




ఏలూరు, డిసెంబరు 15 : రేవ్ పార్టీలో అడ్డంగా దొరికిన ఎంపీ మహేష్ యాదవ్ తక్షణం ఎంపి పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఏలూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు, కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీఎన్నార్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎన్నార్ మాట్లాడుతూ.. శనివారం హైదరాబాద్ మొయినబాద్ ఫామ్ హౌస్ ల పోలీసులు జరిపిన దాడిలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ డ్రగ్స్ తీసుకున్నట్టు నిర్ధారణ చేశారని, ఎన్నికల సమయంలో రాష్ట్రమంతా డ్రగ్స్ లో మునుగుతున్నారని, తనకు ఓటు వేసి తనను గెలిపిస్తే డ్రగ్స్ లేని ప్రాంతంగా చేస్తా అని నీతులు చెప్పారన్నారు. ఏలూరు పార్లమెంటు చరిత్రలో ఎంతోమంది మహానుభావులు పరిపాలన చేశారని, అటువంటి ఏలూరు పార్లమెంట్ చరిత్రను భ్రష్టు పట్టించే విధంగా పుట్టా మహేష్ వ్యవహరించారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ అంటే రాజకీయ పార్టీ కాదని, తెలుగు డ్రగ్స్ పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. పుట్టా మహేష్ మిత్రులు రాజస్థాన్ చెందిన ఎమ్మెల్యేతో కలిసి ఈ పార్టీ నిర్వహించారని, పుట్టా మహేష్ వెంటనే క్షమాపణ చెప్పి ఎంపి పదవికి రాజీనామా చేసి రాజకీయం నుండి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ అడ్డగా కూటమి ప్రభుత్వం వచ్చిందని డీఎన్నార్ ధ్వజమెత్తారు. మీడియా సమావేశంలో ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్, చింతలపూడి నియోజకవర్గ ఇన్చార్జి కంభం విజయరాజు, నగర పార్టీ అధ్యక్షులు గుడిదేశీ శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులు నూకపేయి సుధీర్ బాబు, దాసరి రమేష్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు చేబోయిన వీర్రాజు, జిల్లా అధికార ప్రతినిధి మున్నాల జాన్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు నెరుసు చిరంజీవి, జిల్లా వైయస్సార్ టియుసి అధ్యక్షులు పల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తమరాడ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.





# ఫ్రీ డెలివరీలకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలి

## ప్రభుత్వాసుపత్రుల్లో అందించే వైద్యసేవలపై ప్రజల్లో సంతృప్తిస్థాయి పెరగాలి

## ప్రభుత్వ హాస్పటల్ నుండి ఒక్క ఫిర్యాదు వచ్చినా శాఖాపరమైన చర్యలు తప్పవు

## గర్భిణీ స్త్రీలు, బాలింతలు వార్డుల ఆకస్మిక తనిఖీలో ఏలూరు జిల్లా కలెక్టరు వెట్రిసెల్వి



ఏలూరు, మార్చి 15 : స్థానిక జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం హై-డిపెండెన్సీ యూనిట్, డెలివరీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, గైనకాలజీ వార్డు, పోస్టు ఆపరేటివ్ వార్డు, బాలింతలు వార్డు, తదితర వార్డులను ఏలూరు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీలు చేశారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులతో జిల్లా కలెక్టరు మాట్లాడారు. హాస్పటల్లో వైద్యసేవలు ఏలాగ ఉన్నాయని, డాక్టర్లు, వైద్య సిబ్బంది బాగా చూస్తున్నారా, సమయానికి మందులు ఇస్తున్నారా, టైమ్ ప్రకారం ఆహారం పెడుతున్నారా అని అడగగా మాకు వైద్యసేవలు బాగానే అందుతున్నాయని, మాకు ఏటువంటి ఇబ్బందులు లేవని వారు చెప్పడంతో జిల్లా కలెక్టరు సంతృప్తిని వ్యక్తం చేశారు. డాక్టరు ఎన్టీఆర్ వైద్య సేవ హెల్ప్ డెస్క్ కంప్యూటరు డేటాను పరిశీలించి, వివరాలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీ స్త్రీలకు మంచి వైద్యసేవలతో పాటు ఫ్రీడెలివరీలకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యసేవలుపై ప్రజలకు సంతృప్తి స్థాయి పెరగాలని, వచ్చిన ప్రతి పేషెంటును చిరునవ్వుతో పలకరించి వైద్యసేవలు అందించాలని అన్నారు. ఏ ఒక్క ఫిర్యాదు వచ్చినా శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీ స్త్రీలు ప్రసవాలు పెరిగే విధంగా గైనకాలజిస్టు, వైద్య సిబ్బంది గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితులలో ఆస్పత్రులకు వచ్చేరోగులకు ఏటువంటి డేటా, వివరాలు కోసం సమయం వృధా చేయకుండా తక్షణమే వైద్యులు వైద్యసహాయం అందించాలని అన్నారు. సాధ్యమైనంత వరకు ప్రభుత్వ ఆసుపత్రుల లో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చూడాలని, సిజేరియన్ల శాతం తగ్గే విధంగా డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగులుపట్ల మర్యాదగా వ్యవహరించాలని, పరిశుభ్రమైన వాతావరణ ఉండాలని, వార్డులలో బెడ్ షీట్స్ ఎప్పటికప్పుడు మార్చే విధంగా నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.జిల్లా కలెక్టరు వెంట ఇంచార్చి ఆర్ యంవో డా.బి.ప్రసాదు రెడ్డి, డా.కె.టి.యల్. హైమావతి, డా.యస్. హర్షవర్ధన్, తహశీల్దారు కె.గాయత్రీదేవి, ఏఎన్ఎంలు, వైద్య సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# నేడు యధావిధిగా పీజీఆర్ఎస్.. రెవిన్యూ క్లినిక్‌ల నిర్వహణ



ఏలూరు, మార్చి 15 :ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింతవేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS) సేవలను సోమవారం 16.3.2026 వ తేదీన మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో మార్చి, 16 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా పిజి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించింది. దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల కార్యాలయాల్లో, డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చు. అలాగే, ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్ https://meekosam.ap.gov.in ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే, 1100 (డబుల్ వన్ డబుల్ జీరో) టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

# వంట గ్యాస్‌కు ఎటువంటి కొరత లేదు : ఏలూరు జిల్లా జేసీ



ఏలూరు, మార్చి 15 : జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్లకుఎటువంటి కొరత లేకుండా సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ చెప్పారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో, సోషల్ మీడియాలో గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లకు కొరత ఏర్పడనుందంటూ కొన్ని నిరాధారమైన వదంతులు వ్యాప్తి చెందుతున్నాయని, ప్రజలు ఇటువంటి అవాస్తవాలను నమ్మి ఎలాంటి భయాందోళనలకు గురికావద్దన్నారు. గ్యాస్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడటానికి మరియు ప్రజల గందరగోళాన్ని నివారించడానికి, ఏలూరు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు, ఏలూరు లోని జిల్లా పౌరసరఫరాల అధికారి (DCSO) వారి కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక "జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్" ను ఏర్పాటు చేయడం జరిగిందని, గ్యాస్ సరఫరాలో ఏవైనా సమస్యలు ఎదురైనా, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా వినియోగదారులు వెంటనే కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చున్నారు. ఈ కంట్రోల్ రూమ్ ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 8:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కంట్రోల్ రూమ్ కు సంప్రదించవలసిన ఫోన్ నంబరు :7569296272, వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే కంట్రోల్ రూంకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చున్నారు.

# లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం : న్యాయమూర్తి శ్రీదేవి



ఏలూరు, మార్చి 15 : జాతీయ న్యాయ సేవాదికార సంస్థమరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలు ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించామని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ కాదగిన కేసులను రాజీ చేసుకోవడం ద్వారా డబ్బు, సమయం ఆదావుతుందని అన్నారు. కేసులు పరిష్కారంలో ఏర్పడిన జాప్యాన్ని నివారించడం కోసం జాతీయ లోక్ అదాలత్ సులువైన ఉత్తమమైన మార్గమని, దీన్ని ఉపయోగించుకుని కేసులు నుండి విముక్తి పొందాలని సూచించారు. జాతీయలోక్ నందు 8,815 కేసులు రాజీ చేయబడినట్లు, అందులో 111 ప్రీ లిటిగేషన్ కేసులను, 147 మోటారు వాహన ప్రమాద భీమా కేసులను, 166 సివిల్ కేసులను, 94 చెక్ బౌన్స్ కేసులు, 36 కుటుంబ వివాదాలు కేసులు, 8261 కేసులు క్రిమినల్ మరియు ఇతర కేసులను రాజీ చేయడం జరిగిందని తెలిపారు. వాహన ప్రమాద భీమా కేసులలో రూ 6 కోట్లు పైబడి పరిహారముగా చెల్లించడం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి యు ఇందిరా ప్రియదర్శిని, ఐదవ అదనపు జిల్లా జడ్జి ఆర్.వి.వి.ఎస్.మురళీకృష్ణ, ఏడవదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాస రావు, ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు, భార్ అసోసియేషన్ ప్రెసిడెంటు కొనే సీతారాం, పిపి ఏ.వి.నారాయణ, ప్రభుత్వ న్యాయవాది సుబ్రహ్మణ్యం,లోక్ అదాలత్ సభ్యులు తమ్మినేని విజయకుమార్, ఏఎస్పి నక్కా సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ది క్రైమ్ న్యూస్ Crime News తెలుగు దినపత్రిక
సోమవారం, మార్చి 16, 2026

# పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

## వ్యాధి నివారణ టీకా ప్రచార గోడపత్రికల ఆవిష్కరణలో ప.గో.జిల్లా కలెక్టర్ నాగరాణి



భీమవరం, మార్చి 15 : రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా గాలికుంటు వ్యాధి నివారణ టీకా ప్రచార గోడపత్రికను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మార్చి 15 నుండి ఏప్రిల్ 15 వరకు ఒక నెల రోజులపాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. పశువులలో తీవ్రంగా వ్యాపించే గాలికుంటు వ్యాధి ఒక ప్రమాదకరమైన అంటువ్యాధి అని, ఈ వ్యాధి ముఖ్యంగా గేదెలు, ఆవులు, ఎద్దులు మరియు ఇతర కరువు పశువులలో కనిపిస్తుందని చెప్పారు. ఈ వ్యాధి వల్ల చిన్న దూడలలో మరణాలు సంభవించే అవకాశం ఉందని, అలాగే పెద్ద పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని తెలిపారు. ఈ వ్యాధి వైరస్ ద్వారా వ్యాపిస్తుందని, గాలిలో కూడా సుమారు 30 కిలోమీటర్ల వరకు వ్యాపించే సామర్థ్యం ఈ వైరస్‌కు ఉందని చెప్పారు. దీనివల్ల పశు సంవర్ధక శాఖ ఈ వ్యాధి నివారణకు ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి సంవత్సరం రెండు సార్లు పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని, ఈ టీకాలు వేయడం ద్వారా పశువులను గాలికుంటు వ్యాధి నుండి రక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పశువులలో కనీసం 90 శాతం పశువులకు టీకాలు వేయడం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. మూడు నెలల పైబడిన దూడలకు కూడా ఈ టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేశామని, అన్ని పశువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి డోస్ టీకా ధర సుమారు రూ.20 కాగా, జిల్లాలో మొత్తం సుమారు 1,70,000 పశువులకు టీకాలు వేయడానికి లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు తమ గ్రామాలకు వచ్చే పశుసంవర్ధక శాఖ సిబ్బందికి సహకరించి, తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఆర్.కోటిలింగరాజు, సహాయ సంచాలకులు డాక్టర్ పి.జయకర్ జాన్సన్, డాక్టర్ హేమ, డా.బార్గవిసత్య, జూనియర్ వీటీ అధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

# నేడు.. జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో పిజిఆర్ఎస్


## ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ప.గో.జిల్లా కలెక్టర్ నాగరాణి



భీమవరం, మార్చి 15 : మార్చి 16 సోమవారం జిల్లా కలెక్టరేట్ తో పాటు డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం నందు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహించినట్లు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను వీవవనిశీయిఎ. ఖజూ.స్త్రశీజ.అఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు కూడా నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలంటే 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

# ఎల్పీజీ సిలిండర్ల నిరంతరం సరఫరా చేస్తాం

## అవసరానికి మించి బుకింగ్ చేయొద్దు : తూ.గో.జిల్లా కలెక్టర్ కీర్తి



రాజమండ్రి, మార్చి 15 : జిల్లాలో గృహ అవసరాల వినియోగం కోసం, అలాగే విద్యార్థుల సంక్షేమ వసతి గృహాలు, అత్యవసర సేవలకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు గ్యాస్ సిలిండర్లు గోకవరం, విశాఖపట్నం, విజయవాడలోని ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ల నుంచి ప్రతి రోజూ సాధారణ స్థాయిలో సరఫరా అవుతున్నాయని, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పంపిణీ జరుగుతోందని తెలిపారు. సాధారణ పరిస్థితుల్లో రోజుకు సుమారు 11,000 నుంచి 11,500 వరకు రీఫిల్ బుకింగ్లు నమోదవుతూ ఉంటాయని, అయితే ప్రస్తుతం రోజువారీగా 19,896 నుంచి 22,250 వరకు బుకింగ్లు నమోదవుతున్నాయని తెలిపారు. అంటే సాధారణ పరిస్థితులతో పోలిస్తే దాదాపు 90 నుంచి 95 శాతం వరకు పెరుగుదల నమోదైందన్నారు. సిలిండర్ల డెలివరీలు **FIFO (First In First Out)** విధానంలో కొనసాగుతున్నందున కొన్నిచోట్ల బుకింగ్ చేసిన తరువాత 2 నుంచి 3 రోజులలో డెలివరీలు జరుగుతున్నాయని, కొన్నిచోట్ల అంతరాయం కారణంగా 2 నుంచి 3 రోజుల వరకు ఆలస్యం కనిపిస్తున్నదని వివరించారు. అందువల్ల గ్యాస్ సరఫరా విషయంలో వినియోగదారులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. తప్పుడు సమాచారాన్ని నమ్మి అవసరానికి మించి బుకింగ్లు చేయకుండా, అవసరం మేరకే సిలిండర్లు బుక్ చేసుకోవాలని వినియోగదారులను కోరారు.

గ్యాస్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కంట్రోల్ రూమ్‌లో హెల్ప్‌లైన్ నెంబర్ 8074661259 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే వినియోగదారులు ఈ సేవను వినియోగించు కోవచ్చని సూచించారు. ఒకేసారి అధిక సంఖ్యలో రీఫిల్ బుకింగ్లు చేయడం వల్ల కొన్నిసార్లు కాల్స్ కనెక్ట్ కాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అందువల్ల వినియోగదారులు ఆయిల్ కంపెనీలు ఇచ్చిన నంబర్లకు ఔఓఖ/రాూజూజూ ద్వారా మెసేజ్ పంపడం, మిస్డ్ కాల్ ఇవ్వడం, అలాగే **PhonePe, Google Pay, Paytm, Amazon Pay, UPI** వంటి యాప్‌ల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. ఏజెన్సీ వారీగా శనివారం నమోదైన బుకింగ్స్, డెలివరీలు, గత 72 గంటలకు పైగా పెండింగ్‌లో ఉన్న వివరాలను పరిశీలిస్తే, ... ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం 3,355 బుకింగ్స్ నమోదు కాగా 2,100 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 7,232 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్‌లో ఉన్న బుకింగ్స్ 1,544 ఉన్నాయి. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ పరిధిలో శనివారం 15,278 బుకింగ్స్ నమోదు కాగా 10,134 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 8,077 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్‌లో ఉన్న బుకింగ్స్ 18,306 ఉన్నాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ పరిధిలో శనివారం 1,236 బుకింగ్స్ నమోదు కాగా 727 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 1,138 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్‌లో ఉన్న బుకింగ్స్ 2,394 ఉన్నాయి. శనివారం రోజున మూడు ఆయిల్ కంపెనీల ద్వారా మొత్తం 19,869 బుకింగ్స్ నమోదు కాగా 12,961 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం మూడు సంస్థల వద్ద కలిపి 16,447 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 72 గంటలకు మించిన పెండింగ్ బుకింగ్స్ మొత్తం 22,244 ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్ బుకింగ్స్ త్వరితగతిన క్లియర్ చేయడానికి ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ అదనపు సరఫరా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# జనసేన సభ్యత్వం నమోదుకు ఇక మూడురోజులే ఉంది

## ఏలూరులో ఇప్పటికే 8000 పైగా సభ్యత్వాలు నమోదు : అప్పలనాయుడు



ఏలూరు, మార్చి 15 : జనసేన పార్టీ క్రియాశీలక ఉద్యమి సభ్యత్వ నమోదు కు ఇంకో మూడు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉందని ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. 5 వ విడత క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమంలో భాగంగా ఏలూరులో ఇప్పటికే 8000 వేలకు పైగా సభ్యత్వాలు నమోదయ్యాయని పేర్కొన్న ఆయన మిగిలిన ఈ మూడు రోజుల్లో కూడా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రతి ఒక్క జన సైనికుడు, వీర మహిళలు పార్టీ పొడిగించిన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పదో తారీకుతో ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగిసినప్పటికీ క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ నాయకుల నుండి వచ్చిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. పొడిగించిన ఈ సమయాన్ని ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న ప్రతి ఒక్క జనసైనికుడు వినియోగించుకుని క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలను వివరించి, పార్టీ ఉద్యమ సభ్యత్వాలను పెంచే దిశగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.. నియోజకవర్గం లో జనసేన సభ్యత్వాలను పెంచడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని ఆయన తెలిపారు.

# శంకవరంలో పులిసంచారం.. వాహనాలదారి మళ్లింపు

శంకవరం, మార్జి15 : కాకినాడ జిల్లా శంకవరం సమీపంలో ఉన్న క త్తిపూడి – తుని రహదారి వద్ద పులి కొండపైకి వెళ్లినట్లు గుర్తించారు. ప్రజల భద్రతా దృష్ట్యా అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు అప్రమత్తమై ప్రజలకు సమాచారం అందించారు. ప్రస్తుతం శంకవరం వద్ద కత్తిపూడి – తుని రహదారిపై వాహనాలను దారి మళ్లించి, ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. కాకినాడ అటవీ శాఖ అధికారులు పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రెండు డ్రోన్ బృందాలు, ఒక బీహెచ్ఎఫ్ సిగ్నల్ ట్రాకింగ్ బృందం, రెండు డార్టింగ్, రక్షణ బృందాలు(ఎన్ఎన్టీఆర్, రాజమహేంద్రవరం)తో అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్.రామచంద్రరావు ఘటనాస్థలంలో ఉండి బృందాల పనితీరును పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# ప.గో. జిల్లా వార్తలు









# కృషి..పట్టుదలతో సాగితేనే విజయం

## విద్యార్థులు సమాజంలో ఉన్న సమస్యలపైనా అవగాహన పెంచుకోవాలి

## ఇంజినీరింగ్ విద్యలో అన్ని బ్రాంచ్‌లు సమానమైనవే : ప.గో.జిల్లా కలెక్టర్ నాగరాణి



భీమవరం, మార్చి 15 : విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా సమాజంలో ఉన్న సమస్యలపై కూడా అవగాహన పెంపొందించుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. డా. బి.వి. రాజు ఫౌండేషన్, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలలో నిర్వహించినవార్షికోత్సవ కార్యక్రమానికి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడనాగరాణి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఇంజినీరింగ్‌విద్యలో అన్ని బ్రాంచ్‌లు సమానమైన ప్రాధాన్యత కలిగినవేనని విద్యార్థులకుసూచించారు. ఏ విభాగంలో చదివినా కృషి, ప్రతిభ, పట్టుదలతో ముందుకుసాగితే విజయాన్ని సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువులోనేకాకుండా సమాజంలో ఉన్న సమస్యలపై కూడా అవగాహన పెంపొందించుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.విద్యార్థులు సాంకేతిక విద్యను సమాజానికి ఉపయోగపడే విధంగావినియోగించాలని, సృజనాత్మక ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ప్రోత్సహించారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో ముఖ్యమని, అందుకు తగిన విధంగా విద్యార్థులు తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు మాట్లాడుతూ భీమవరం విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన 18వ వార్షిక దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. తక్కువ కాలంలోనే విద్యా రంగంలో విశేష పురోగతి సాధించిన విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల అడ్మిషన్లలో మూడో స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యా విజయాలతో పాటు క్రీడా రంగంలో కూడా విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారని చెప్పారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం కళాశాలలో సంవత్సరం పొడవునా అనేక ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఎన్ఎస్ఎస్ డే, మ్యాథమేటిక్స్ డే, ఇన్నోవేషన్ డే, స్టార్టప్ మరియు ఇన్నోవేషన్ కార్యక్రమాలు, అలాగే జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత గల పలు దినోత్సవాలను ఉత్సాహంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి సహకరించిన మేనేజ్‌మెంట్‌కు, అంకితభావంతో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి, అలాగే తమపై విశ్వాసం ఉంచిన తల్లిదండ్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# డాక్టర్ రంగరాజుకు సత్కారం



ఉండి, మార్చి 15 : ఆకివీడు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో సరిగమ సంగీత పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పురస్కారాల వేడుక జరిగింది. ఈ సందర్భంగా ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ఉగాది విశిష్ట గురించి, తెలుగు వారి సంప్రదాయం, ఆచార వ్యవహారాలు మీద కవి పండితులు చేసిన కవితా గానం పలువురి మన్ననలను పొందాయి. ప్రముఖ కవి డాక్టర్ గాదిరాజు రంగరాజు ఎంపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు రంగారాజుకు కవి సత్కారం చేశారు.కోటేశ్వరరావు, వెంకన్నబాబు, విరజానంద, రాయప్రోలు భగవాన్, బుద్దాల రామారావు, జుంగా దాస్, డాక్టర్ వీఎా సూర్యనారాయణరాజు, హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాంధ్ర పరీక్షలకు 99.9 శాతం హాజరు

## ఫైనల్ పరీక్షల్లో ఉత్సాహంగా పాల్గొన్న అక్షరాంధ్ర అభ్యాసకులు

## 60,829 మంది పరీక్షలకు హాజరు : ప.గో.జిల్లా కలెక్టర్ నాగరాణి





భీమవరం, మార్చి 15 : పశ్చిమ గోదావరి జిల్లాలో అక్షరాంధ్ర ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ (ఖీూచీూు) పరీక్షను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించినట్లు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సహజంగా విద్యార్థులు పరీక్షలకు ప్రిపేర్ అయ్యి ఫైనల్ పరీక్షల్లో ఎంతో ఉత్సాహంగా రాయడం సాధారణంగా ప్రతి ఒక్కరు చూసేదే. నేడు అంతకుమించి అన్నట్లుగా అక్షరాంధ్రఅభ్యాసకులు ఫైనల్ పరీక్షల్లో పాల్గొనడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలను జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ పరీక్షలు సజావుగా నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు, పరీక్ష రాసే వయోజనుల హాజరు, మరియు పరీక్షా నిర్వహణ విధానంపై అధికారులతో కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలోనిరక్షరాస్యులైన మహిళలు మరియు పురుషులకు ప్రాథమిక చదువు నేర్పించి,వారికి ఈరోజు ఫైనల్ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోనిఅన్ని గ్రామాలలో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధితశాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలో మొత్తం 60,865 మంది అభ్యర్థులు పరీక్షలకు నమోదు కాగా, వారిలో 60,829 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 99.9 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో గ్రామ స్థాయి సిబ్బంది, వలంటీర్లు, మరియు విద్యా శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేసినట్లు పేర్కొన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా ... తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నందుకు జిల్లా స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, వాలంటీర్లు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

# ఐవిఎఫ్ పట్టణ అధ్యక్షుడుగా వీరవల్లి శ్రీనివాసరావు

జగ్గయ్యపేట, మార్చి 15 : జగ్గయ్యపేట పట్టణం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నూతన కార్యవర్గ కమిటీ ఐవిఎఫ్ కార్యాలయం నందు సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొడ్డు మురళి ఆదేశాల మేరకు ఏర్పాటు చేయటం జరిగింది.ఐ వి ఎఫ్ ఆధ్యాత్మిక కమిటీవైస్ ప్రెసిడెంట్ పేరూరి వెంకట లక్ష్మి నరసింహారావు, ఐ వి ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకరపర్తి సోమేశ్వరరావు, జిల్లా కోశాది కారి పెనుగొండ రామకృష్ణ, ఆధ్వర్యంలో నూతన అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాసరరావు, కార్యదర్శి రాయపూడి రమేష్, గా నిమించారు. గౌరవ సలహాదారులుగా మారం శ్రీనివాస్ రరావు, గౌరవ అధ్యక్షులు నకరికంటి తిరుపతిరావు ను ఎన్నిక కొన్నారు. వారిని ఐ వి ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకరపర్తి సోమేశ్వరరావు, జిల్లా నేతలు పేరూరి వెంకట లక్ష్మీ నరసింహారావు, కంభం పాటి రవి కుమార్, చౌట రమేష్ వారిని అభినందించారు.

# విశ్వ్యజి



## ఒత్తయిన జుట్టు కోసం

జుట్టు ఒత్తుగా నిగనిగలాడుతూ ఉండాలని ప్రతిఒక్కరూ ఆశపడతారు. కానీ, నేటి ఉరుకులు పరుగుల జీవితంలో జుట్టుపై శ్రద్ధపెట్టే సమయమెక్కడిదీ? జుట్టు సమస్యలకు ఒత్తిడి, నిద్రలేమి వంటి కారణాలెన్నో. చాలామంది జుట్టురాలడం, చుండ్రు వంటి సమస్యలను తగ్గించుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. హెయిర్ ప్యాక్‌లు, మసాజ్‌లు, రకరకాల చిట్కాలు పాటిస్తారు. ఒత్తయిన జుట్టుకోసం మీరూ ఓసారి ఇలా ట్రై చేయండి.

క్యారెట్: క్యారెట్ వెంట్రుకలను దృఢంగా ఉంచడంలో తోడ్పడుతుంది. దీనిలో విటమిన్ బీ7 పుష్కలంగా ఉంటుంది. దీన్నే బయోటిన్ అని పిలుస్తారు. ఇది జుట్టు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. అందుకే దీన్ని ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే క్యారెట్‌ని ఉపయోగించి తయారుచేసిన హెయిర్‌ప్యాక్‌ని అప్పుడప్పుడూ వేసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందచ్చు. దీనికోసం కొన్ని క్యారెట్ ముక్కలను తీసుకొని నీటిలో వేసి ఉడకబెట్టి మెత్తటి పేస్ట్‌లా తయారుచేయాలి. ఈ మిశ్రమాన్ని తలకు అప్లై చేసి అరగంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత తలస్నానం చేయాలి. ఈ ప్యాక్ వెంట్రుకలు రాలడాన్ని నియంత్రించి వాటిని దృఢంగా పెరిగేలా చేస్తుంది.

గ్రీన్ టీ: గ్రీన్ టీ తాగడంతో పాటు తలకు ప్యాక్‌లా పట్టించడం వల్ల కూడా జుట్టు రాలే సమస్యను తగ్గించుకోవచ్చు. దీనికోసం నాలుగైదు గ్రీన్ టీ బ్యాగ్‌లను.. అరలీటర్ నీటిలో వేసి వేడి చేయాలి. నీళ్లు చల్లారిన తర్వాత పక్కన పెట్టుకోవాలి. తలస్నానం చేసిన తర్వాత ఈ నీటితో తలను బాగా తడపాలి. పది నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. ఇది మంచి కండిషనర్‌గా పనిచేస్తుంది.

మందారం హెయిర్ ప్యాక్: ముందుగా మందార పూలను రెండు రోజుల పాటు ఎండలో ఆరబెట్టుకోవాలి. పూలతో పొడి చేసుకోవాలి. ఇప్పుడు మూడు టేబుల్ స్పూన్ల పెరుగులో ఓ టేబుల్ స్పూన్ మందారం పొడిని కలపాలి. ఇందులో రోజ్ మేరీ ఎస్సెన్స్ కూడా కలుపుకోవచ్చు. ఇది పింక్ రంగులోకి మారిన తర్వాత తలకు పట్టించి ఆరిన తర్వాత తలస్నానం చేయాలి.

## స్లిమ్ గా కావాలని చూస్తున్నారా?

# అయితే కొబ్బరినూనె మ్యాజిక్ ట్రై చెయ్యండి!



ఆరోగ్యంగా ఉండాలని ఎవరి కోరుకోరు? ఈ భూమి మీద ఉన్న ప్రతి ఒక్కరు ఆరోగ్యంగాను, అందంగా ఉండాలని కోరుకుంటారు. అంతేకాదు నాజుగ్గా ఉండాలని కూడా కోరుకుంటారు. అటువంటివారు బరువు తగ్గడం కోసం ఎన్నెన్నో చేస్తూ ఉంటారు. జిమ్ కు వెళ్లడం, డైట్ ఫాలో అవ్వడం ఇలా ఎన్ని చేసినప్పటికీ మంచి ఫలితం రాదు అటువంటివారు కొబ్బరినూనె మీ శరీరంపైన బరువు తగ్గడం కోసం చేసే మ్యాజిక్ తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు.

కొబ్బరినూనెలో ఫుల్ పోషకాలు

కొబ్బరి నూనెలో చాలా పోషకాలు ఉంటాయి. కొబ్బరి నూనె శరీరానికి కావలసిన ఎన్నో మంచి గుణాలతో సమ్మిళితమై ఉంటుంది. కొబ్బరి నూనెలో మోనో అన్సాచ్యురేటెడ్ కొవ్వు ఆమ్లాలు చాలా ఉంటాయి. ఇవి ఆహారంలో అదనపు కొలెస్ట్రాల్ ను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. సహజంగా కొబ్బరి నూనె జుట్టు ఆరోగ్యానికి మాత్రమే ఉపయోగిస్తారు కానీ వంటకు కొబ్బరి నూనెను ఉపయోగించడం ఎంతో మంచిది.

బరువు తగ్గాలంటే కొబ్బరి నూనె ఇలా తీసుకోవాలి

చాలా ఆరోగ్యకరమైన కొబ్బరి నూనె వినియోగం వల్ల బరువు బాగా తగ్గే అవకాశం ఉంటుంది. కొబ్బరి నూనెను పరగడుపున తీసుకుంటే నెలరోజుల్లో మీ శరీరంలో చాలా మంచి మార్పు వస్తుంది. కొబ్బరినూనె బొద్దు కొవ్వును తగ్గిస్తుందని చెప్తారు. బరువు తగ్గాలనుకునేవారు కొబ్బరినూనెను ఏ విధంగా తీసుకోవాలి అంటే ఖాళీ కడుపుతో ప్రతిరోజు ఒక టీ స్పూన్ కొబ్బరి నూనె తాగడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది.

కొబ్బరి నూనెతో చర్మం కాంతివంతం

కొవ్వు త్వరగా తగ్గుతుంది. గోరువెచ్చని నీటిలో ఒక స్పూన్ కొబ్బరినూనె కలుపుకుని తాగినా మంచి ప్రయోజనం ఉంటుంది. దీనిని ప్రతిరోజు కచ్చితంగా పాటించటం వల్ల శరీరంలో పేరుకుపోయిన చెడు కొవ్వు నుండి విముక్తి లభిస్తుంది. ఒకే నెలలో మూడు కిలోల వరకు బరువు తగ్గడానికి అవకాశం ఉంటుంది. కొబ్బరినూనె మన చర్మాన్ని కాంతివంతం చేస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.

కొబ్బరినూనె ఇలా తీసుకున్నా లాభమే

మనం తినే ఆహారంలో ఉండే చెడు కొవ్వులు మన శరీరంలో పేరుకుపోయి బరువు పెరగడానికి కారణమవుతాయి. అయితే కొబ్బరి నూనెలో ఉండే ట్రై గ్లిజరైడ్స్ ఇతర కొవ్వుల కంటే ఆరోగ్యకరంగా ఉంటాయి. ఇక కొబ్బరి నూనెను తేనెతో కలిపి రోజుకు మూడు నాలుగు సార్లు తీసుకోవడం కూడా ప్రయోజనం ఇస్తుంది.

# ఓట్స్ అధికంగా తింటే అనర్థాలు.. జాగ్రత్త!



ఓట్స్... చాలామంది ప్రతిరోజూ ఓట్స్ తింటూ ఉంటారు. ఓట్స్ తో మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని భావిస్తారు. ఓట్స్ లో విటమిన్ బి2, విటమిన్ సి, పీచు పదార్థం, పిండి పదార్థాలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ఓట్స్ చాలా మంచి పౌష్టికాహారంగా చెప్పవచ్చు. అతిగా ఓట్స్ తింటే అనర్థాలు ఇక ఓట్స్ తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అన్నమాట ఎంత వాస్తవమో అతిగా తింటే అనారోగ్యం కూడా వస్తుంది అనే విషయం అంతే వాస్తవం.

ఇక ఓట్స్ తినడం వల్ల కలిగే అనారోగ్యాలు, మన శరీరానికి కలిగే నష్టాలు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం. ఓట్స్ అతిగా తినడం వల్ల అనేక అనారోగ్యాలు వస్తాయి. అధికంగా ఓట్స్ తిన్న వారిలో కొంతమందికి కడుపు ఉబ్బరం మరియు గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. అధికంగా ఓట్స్ తింటే ఆరోగ్య సమస్యలు ఓట్స్ జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. అందుకే ఓట్స్ అధికంగా తినడం మంచిదికాదు.

ఓట్స్ లోని ఫైటిక్ యాసిడ్ క్యాల్షియం ,ఇనుము మరియు జింక్ వంటి కొన్ని ఖనిజాల శోషణను నిరోధిస్తుంది. ఓట్స్ అధికంగా తిన్నవారు మలబద్ధకం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. కొంతమందికి ఓట్స్ లో ఉండే ప్రోటీన్ కారణంగా అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంది. ఓట్స్ పదేపదే తింటే ఇన్ఫెక్షన్స్ ఓట్స్ ను సరిగ్గా శుభ్రం చేయకపోతే, అవి తిన్నవారికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. పోషకాలు బాగా ఉంటాయని అతిగా ఓట్స్ తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఓట్స్ ప్రతిరోజు తీసుకోవడం వల్ల చాలామందిలో కడుపుకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఓట్స్ ఎక్కువగా తినడం వల్ల వాటిలో క్యాలరీలు తక్కువగా ఉండటం కారణంగా మన శరీరంలో కూడా క్యాలరీల లోపం ఏర్పడే అవకాశం ఉంది.

మితంగా తింటే ఆరోగ్యం కాబట్టి ఓట్స్ ను తినాలి అని అనుకుంటే ఒక నియమిత పద్ధతిలో తినడం మంచిది. ప్రతిరోజు బ్రేక్ ఫాస్ట్ గా ఓట్స్ మాత్రమే తినడం మంచిది కాదు. ఆరోగ్యానికి మేలు చేకూర్చే ఓట్స్ అధికంగా తింటే కొన్ని దుష్ప్రభావాలు వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకొని తదనుగుణంగా మితంగా తింటే మంచిది.

# మార్కెట్


## ఎంటార్‌కు 34 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ : రాష్ట్రానికి చెందిన ఎంటార్ టెక్నాలజీ మరో భారీ ఆర్డర్‌ను

MTAR®

చేజిక్కించుకున్నది. క్లీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ రంగాల నుంచి రూ.34 కోట్ల విలువైన ఆర్డర్ లభించినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ ఆర్డర్లలో భాగంగా క్లీన్ ఎనర్జీతోపాటు ఏరోస్పేస్ రంగాలకు సంబంధించి ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా సరఫరా చేయాల్సివుంటుందని కంపెనీ ఎండీ పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌లోనే తొమ్మిది యూనిట్లు ఉన్నాయి.

## నిధుల సేకరణలో ఎస్బీఐ



న్యూఢిల్లీ : దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) భారీ స్థాయిలో నిధులను సేకరించడానికి సిద్ధమవుతున్నది. ఈ నెల 20న పబ్లిక్ ఆఫర్ లేదా ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా 3 బిలియన్ డాలర్లు(రూ.25 వేల కోట్లు) నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. ఈ నిధుల సేకరణకు సంబంధించి బ్యాంక్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నది. దీర్ఘకాలికంగా ఒకేసారి లేదా పలు దఫాలుగా 3 బిలియన్ డాలర్ల నిధులు సేకరించాలని నిర్ణయించింది. బ్యాంక్ షేరు ధర స్వల్పంగా తగ్గి రూ.800 వద్ద ముగిసింది.

# భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దు..



## టిమ్ కుక్‌కు సూచించిన ట్రంప్

ఖతార్ వేదికగా భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దని ఆ సంస్థ సీఈవో టిమ్ కుక్ కు సూచించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదికను ఊటంకిస్తూ ప్రముఖ జాతీయ మీడియా ఇండియా టుడే తెలిపింది.

అధ్యక్షుడు ట్రంప్ ప్రస్తుతం అరబ్ దేశాల పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. తన పర్యటనలో భాగంగా నిన్న ఖతార్‌ను సందర్శించారు. ట్రంప్ కోసం ఎమిర్ ఆఫ్ ఖతార్ దోహాలో ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేసింది. ఈ విందుకు పలువురు సీఈవోలు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఈ విందుకు హాజరైన యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో ట్రంప్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తన అభిప్రాయాన్ని టిక్ కుక్‌కు తెలియజేశారు. భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దని సూచించారు.

'నాకు టిమ్ కుక్‌తో నిన్న చిన్న సమస్య ఎదురైంది. అతడు భారత్‌లో తయారీ కర్మాగారాల నిర్మాణాలు చేపట్టారు. అలా చేయడం నాకు ఇష్టం లేదని చెప్పాను. ఫలితంగా అమెరికాలో ఉత్పత్తి పెంచేందుకు యాపిల్ అంగీకరించింది. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. అక్కడ వ్యాపారం చేయడం చాలా కష్టమని టిమ్ కుక్‌కు వివరించా. భారత్ కోసం ఆలోచించాల్సిన అవసరం లేదు. ఆ దేశం తనను తాను చూసుకోగలదని చెప్పా. నా వల్ల యాపిల్ సంస్థ ఇప్పుడు యూఎస్‌లో 500బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా చైనా దేశాల మధ్య టారిఫ్‌ల యుద్ధం కారణంగా దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. ఇందులో భాగంగానే అమెరికా మార్కెట్లో విక్రయించే ఐఫోన్ల తయారీకి సంబంధించిన పూర్తి అసెంబ్లీని భారత్‌కు తరలించాలని కంపెనీ యోచిస్తోంది. వచ్చే ఏడాది సాధ్యమైనంత తొందరగానే అమెరికా ఫోన్‌లకు సంబంధించిన యాపిల్ ఐఫోన్ అసెంబ్లీ భారత్‌కు తరలించే అవకాశం ఉందని గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి సంస్థలు ఇప్పటికే భారత్‌లో ఐఫోన్ అసెంబ్లింగ్ చేస్తున్న విషయం తెలిసిందే. జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే ఐఫోన్లలో అత్యధికంగా భారత్‌లో తయారైనవే ఉంటాయని టిమ్ కుక్ ఇటీవల ప్రకటించారు. ఐపాడ్స్, మ్యాక్‌బుక్, యాపిల్ వాచ్‌లు, ఎయిర్‌పాడ్స్ వంటి ఉత్పత్తులను మాత్రం వియత్నాం నుంచి దిగుమతి చేసుకోవాలని యాపిల్ భావిస్తోంది.

## కొనసాగుతున్న క్రెటా హవా

### టాప్-10 మోడళ్లలో తొలిస్థానంలో హ్యుందాయ్ మోడల్

న్యూఢిల్లీ : కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ హవా కొనసాగుతున్నది. గత నెలలో దేశవ్యాప్తంగా అమ్ముడైన టాప్-10 మోడళ్లలో మారుతికి చెందిన ఏడు కార్లకు చోటు లభించింది. కానీ, మొదటి స్థానంలో హ్యుందాయ్‌కు చెందిన క్రెటా ఈసారి తొలి స్థానాన్ని దక్కించుకున్నట్టు దేశీయ వాహన తయారీదారుల సంఘం(సియామ్) తాజాగా వెల్లడించింది. టాప్-10 కార్లు, ఎస్‌యూవీలలో 17 వేల యూనిట్లతో క్రెటా తొలి స్థానంలో నిలిచింది. క్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 15,447 యూనిట్లతో పోలిస్తే 10 శాతం పెరిగాయని తెలిపింది. ఆ తర్వాతి స్థానాల్లో మారుతికి చెందిన డిజైర్, బ్రెజ్జా, ఎర్టిగాలకు చోటు లభించగా..మహీంద్రాకు చెందిన స్కార్పియో ఆ తర్వాతి స్థానం లభించింది. టాప్-10 జాబితాలో టాటా మోటర్స్‌కు చెందిన వాహనాలకు చోటు లభించలేదు. గత నెలలో మొత్తంగా 1.60 లక్షల యూనిట్ల ఎస్‌యూవీలు అమ్ముడయ్యాయి.

క్రైమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక




# సినీ ఇండస్ట్రీలో చేదు అనుభవం..

## దర్శకుడి ప్రవర్తన నచ్చక సినిమా వదిలేశా: లావణ్య త్రిపాఠి

సాధారణంగా వివాదాలకు దూరంగా ఉండే హీరోయిన్ లావణ్య త్రిపాఠి తాజాగా సినీ పరిశ్రమలో తనకు ఎదురైన ఒక చేదు అనుభవం గురించి మాట్లాడి సంచలనం రేపింది. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉండే చీకటి కోణాలు, మహిళలు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. కరోనా సమయంలో తాను ఒక తమిళ సినిమా ఒప్పుకున్నానని లావణ్య త్రిపాఠి వెల్లడించింది. అయితే ఆ సినిమా షూటింగ్ సమయంలో దర్శకుడి ప్రవర్తన తనకు ఏమాత్రం నచ్చలేదని ఆమె తెలిపింది. షూటింగ్ స్పాట్‌లో తాను సురక్షితంగా లేనట్టుగా అనిపించడంతో పాటు అసౌకర్యంగా భావించానని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో ధైర్యంగా ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నానని లావణ్య చెప్పింది. అయితే సినిమా నుంచి బయటకు వచ్చిన తర్వాత పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయని ఆమె తెలిపింది. సదరు దర్శకుడు, నిర్మాతలు తనను టార్గెట్ చేసి పత్రికల్లో తప్పుడు కథనాలు రాయించారని, అంతేకాకుండా తనపై కేసులు కూడా పెట్టారని ఆమె ఆరోపించింది. ఆ సమయంలో తనకు ఎవరూ మద్దతుగా నిలవలేదని, తీవ్ర మానసిక వేదనను అనుభవించానని లావణ్య ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో నెటిజన్లు, సినీ అభిమానులు ఈ అంశంపై చర్చిస్తున్నారు. ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొనే సమస్యలపై మరోసారి చర్చ మొదలైంది. ఇక లావణ్య త్రిపాఠి సినిమాల విషయానికి వస్తే, మెగా హీరో వరుణ్ తేజ్‌తో వివాహం తర్వాత ఆమె నటిస్తున్న తొలి చిత్రం 'సతీ లీలావతి'. ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో దేవ్ మోహన్ హీరోగా నటిస్తున్నారు. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. వాస్తవానికి ఈ నెలలోనే సినిమా విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి నటిస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



# అనుపమ మూవీకి సెన్సార్ కష్టాలు

మలయాళ నటులు అనుపమ పరమేశ్వరన్, కేంద్రమంత్రి సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను కాస్మోస్ ఎంటర్‌టైనమెంట్స్ నిర్మిస్తుండగా.. శృతి రామచంద్రన్, మాధవ్ సురేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూన్ 27 ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ అభ్యంతరం వలన సినిమా వాయిదా పడినట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో బాధితురాలి పాత్రకు జానకి అని దైవ సంబంధమైన పేరుని పెట్టడంపై ముంబై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చిత్రంలో జానకి అనే పేరుతో ఓ మహిళ అత్యాచార బాధితురాలిగా న్యాయపోరాటం చేస్తుందని, అయితే 'జానకి' అనేది సీతాదేవికి మరో పేరు కావడంతో, అలాంటి పేరును అత్యాచార బాధితురాలికి పెట్టకూడదని సెన్సార్ బోర్డు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై దర్శకుడు ప్రవీణ్ నారాయణన్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో స్పందిస్తూ, జూన్ 27న విడుదల కావాల్సిన సినిమా వాయిదా పడిందని ధృవీకరించారు. ఈ నిర్ణయంపై మలయాళ సినీ పరిశ్రమలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఫిల్మ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ జనరల్ సెక్రటరీ బి. ఉన్నికృష్ణన్ సెన్సార్ బోర్డు నిర్ణయాన్ని విమర్శించారు. దేవుళ్ల పేర్లు కలిగిన పాత్రలకు ఇటువంటి నిబంధనలు పెట్టడం విడ్డూరంగా ఉందని, ఇది కళాత్మక స్వేచ్ఛను అడ్డుకుంటుందని ఆయన అన్నారు. ఇలాంటి నిబంధనలు ఉంటే, హిందూ మతానికి చెందిన పాత్రలకు పేర్లు ఎంపిక చేసుకోవడం చాలా కష్టమవుతుందని ఆయన ప్రశ్నించారు. తిరువనంతపురంలోని ప్రాంతీయ సెన్సార్ కార్యాలయం ఈ చిత్రానికి జ/o సర్టిఫికేట్ జారీ చేసినప్పటికీ, ముంబైలోని ప్రధాన కార్యాలయం ఈ టైటిల్‌ను మార్చాలని డిమాండ్ చేయడంతో ఈ సమస్య తలెత్తింది. పేరు మార్చాల్సి వస్తే, సినిమాలోని అనేక సంభాషణలను కూడా మార్చాల్సి వస్తుందని మేకర్స్ ఆందోళన చెందుతున్నారు.



# విజయ్‌తో లవ్‌లో త్రిష ...అంటూ పుకార్లు

ఓ స్టార్ హీరోతో హీరోయిన్ త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ కోలీవుడ్‌లో వార్తలొచ్చాయి. సదరు హీరోతో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో త్రిష పంచుకుంటూ బర్త్‌డే విషెస్ తెలియజేయడం, అదే ఫొటోను ఆమె తల్లి షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీ జోడించడం అందుకు కారణం. ఆ రూమర్స్‌పై త్రిష పరోక్షంగా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రేమపై పోస్టు పెట్టారు. పూర్తిగా ప్రేమలో మునిగిపోతే, అది కొందరిని తికమక చేస్తుందని పేర్కొన్నారు. తాజాగా కోలీవుడ్ హీరోయిన్ త్రిష చేసిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో రచ్చకు కారణమైంది. జూన్ 22న విజయ్ బర్త్ డే సందర్భంగా హ్యాపీ బర్త్ డే బెస్టెస్ట్ అని హగ్ సింబల్ జత చేసి విజయ్ తో పక్క పక్కనే కూర్చున్న పిక్ షేర్ చేసింది త్రిష. అంతేనా ఈ ఫోటోకు త్రిష తల్లి సైతం లవ్ సింబల్స్ జోడించి ఇన్ స్టా స్టోరీ పెట్టింది. దాంతో త్రిష, విజయ్ మధ్య లవ్ అఫైర్ ఉందని నెటిజన్స్ వీరిని లవర్స్ గా కన్ఫామ్ చేసారు. ఈ ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారని చాలా కాలం వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఈ ఇద్దరు ఎప్పుడు వాటిని ఖండించలేదు. విజయ్ అండ్ త్రిష లవ్ బర్డ్స్ అంటూ ఇప్పటి నుండే కాదు.. ఎప్పటి నుండో గాసిప్స్ వినిపిస్తూనే ఉన్నాయి. ఇద్దరూ కలిసి జర్నీ చేయడం, కీర్తి సురేష్ పెళ్లికి గోవా వెళ్లడం కూడా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని కన్ఫర్మ్ చేస్తున్నారు నెటిజన్లు. రీసెంట్లీ గుడ్ పీపుల్, గుడ్ టైమ్స్ అంటూ ఓ పోస్ట్ పెట్టింది త్రిష. బర్త్ డే రోజు విజయ్ కుక్క పిల్లని ఎత్తుకున్న ఫోటో షేర్ చేసింది. కుక్క పిల్లను ఈ ఏడాదే ఫిబ్రవరిలో త్రిష దత్తత తీసుకుంది. అంటే ఆ ఫోటో రీసెంట్ గా తీసుకుంది. ఇద్దరు కలిసి త్రిష ఇంట్లో పార్టీ చేసుకున్నారన్న టాక్ నడుస్తోంది. త్రిష, విజయ్ 2004లో గిల్లీ సినిమాలో తొలిసారి జతకట్టారు. 2006లో ఆదితో పాటు రీసెంట్లీ లియోలోను కలిసి నటించారు. తన 25 సంవత్సరాల కెరీర్లో ఇప్పటి వరకు స్పెషల్ సాంగ్ చేయని త్రిష గోట్‌లో విజయ్ కోసం నర్తించింది. దీంతో ఈ ఇద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ అనే చర్చకు బలం చేకూరింది.







# మీనాకుమారి బయోపిక్‌లో కియారా అద్వానీ

బాలీవుడ్‌లో మళ్లీ బయోపిక్‌ల ట్రెండ్ జోరుగా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో మరో బయెపిక్ తెరమీదకి రాబోతుంది. దివంగత నటి, 'ట్రాజెడీ క్వీన్' గా ప్రసిద్ధి చెందిన మీనా కుమారి జీవితం ఆధారంగా ఒక బయోపిక్ రాబోతున్నట్లు తెలుస్తుండగా.. ఈ చిత్రంలో కియారా అద్వాణీ మీనాకుమారి పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అలనాటి 'ట్రాజెడీ క్వీన్' మీనా కుమారి గురించి సినీ ప్రియులకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'బైజుబావ్రా', 'పాకీజా' వంటి క్లాసిక్ చిత్రాలతో భారతీయ సినిమా చరిత్రలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు మీనా కుమారి. ఆమె జీవితంలో దాగి ఉన్న భావోద్వేగాలు, బాధలు, కీర్తి, ప్రేమ.. ఇలా అన్నీ వెండితెరపై మరోసారి ప్రతిభావంతంగా ఆవిష్కరిం చేందుకు బాలీవుడ్ సిద్ధమవుతోంది. ఈ భారీ బయోపిక్‌కు ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించబోతున్నట్లు సమాచారం. ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన మనీష్, ఇప్పుడు సినిమా దర్శకత్వంలో అరంగేట్రం చేయనుండగా, ఆయన తొలి చిత్రమే 'మీనా కుమారి' బయోపిక్ కావడం విశేషం. తాజా సమాచారం ప్రకారం, ఈ ప్రతిష్టాత్మక బయోపిక్‌లో కియారా అద్వాణీనే కథానాయికగా ఎంపికైనట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మీనా కుమారి పాత్రలో నటించేందుకు పలువురు హీరోయిన్‌లు ఆసక్తి చూపినప్పటికీ, ఆ పాత్రకు అవసరమైన భావోద్వేగం, విలువ, గంభీరత కియారా నుంచే రావచ్చని చిత్ర బృందం బలంగా నమ్ముతోందట. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశలో ఉన్నాయని, దీనిపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని కియారా సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.





# ధనుష్ ..మీరెంత మంచి వారో

## ప్రశంసలతో పోస్ట్ చేసిన రష్మిక

కోలీవుడ్ స్టార్ ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రలో, శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందించిన తాజా చిత్రం 'కుబేర' సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న కుబేర.. మంచి వసూళ్లతో సత్తా చాటుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అదిరిపోయే కలెక్షన్లు రాబడుతోంది. ఈ మూవీ ద్వారా నాగ్ లో కొత్తకోణం కనిపించింది. ఇక ధనుష్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు అయితే ఫిదా అయ్యారు. ఇందులో సమీరా పాత్రలో నటించిన రష్మిక కూడా ప్రేక్షకులను మెప్పించింది. అయితే తాజాగా తన కోస్టార్ ధనుష్ గురించి ఒక ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకుంది రష్మిక. 'మీతో అంత పెద్ద సినిమా చేసినప్పటికీ మనిద్దరిది ఒక్క సెల్ఫీ మాత్రమే ఉంది. మీరు అద్భుతమైన వ్యక్తి, మనం మట్లాడుకున్న ప్రతిసారీ వేర్వేరు నగరాల్లో ఉన్నాం. ఇద్దరం వేర్వేరు పనులు చేసుకుంటూ మాట్లాడుకునేవాళ్లం. విశ్రాంతి ఎంత ముఖ్యమో చర్చించేవాళ్లం. కానీ, విశ్రాంతి మాత్రం తీసుకోలేదు. కుబేర నటనపరంగానే కాదు.. నిజ జీవితంలోనూ మీరు చేసే పనులు ఎంతోమందికి ఆదర్శం. చుట్టూ ఉన్న వారితో ఎంతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటారు. ముఖ్యంగా మీరు సెట్‌ల్లో నాకోసం తెచ్చిన లడ్డులను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. నాకు తమిళ డైలాగుల్లో మీరు చేసిన సహాయం.. నేను ఏదైనా డైలాగ్ చెప్పినప్పుడు మీరు ప్రశంసించిన తీరు. ఇవన్నీ చిన్న చిన్న విషయాలు కావచ్చు. కానీ, జీవితమంతా గుర్తుంటాయి' అంటూ ధనుష్ దిగిన సెల్ఫీ ని షేర్ చేశారు రష్మిక. తాజాగా రష్మిక మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com